విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

శనివారం 15 మార్చి 2025 8 పేజీలు

రైతుల భూములను ఎండోమెంట్ పరిధి నుంచి మినహాయించాలి

- 19న జిల్లా స్థాయి సదస్సు
- జయప్రదానికి జంగాల అజయ్‌కుమార్ పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రైతుల భూములను ఎండోమెంట్ పరిధి నుంచి మినహాయించాలని, దేవదాయ, ధర్మదాయ శాఖ అక్రమంగా తీసుకున్న భూములను తిరిగి రైతులకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19వ తేదిన జిల్లా స్థాయి సదస్సు నిర్వహించబోతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లోని వీఎస్‌కే హాలులో ఉదయం 10 గంటలకు జరిగే సదస్సుకు రైతు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ అంశంపై త్వరలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రిని కూడా కలిసి సమస్యను వివరిస్తామని చెప్పారు. మిగతా 2లో ...

విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉంటాం

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- 715 విభిన్న ప్రతిభావంతులకు పరికరాలు పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ : జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉంటామని పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్(చిన్ని) భరోసా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం, కృత్రిమ అవయవాల తయారీ సంస్థ అలింకో సంస్థ సహకారంతో ఎంపీ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు వీల్ చైర్స్, ట్రై సైకిల్, కృత్రిమ అవయవాలు పంపిణీ కార్యక్రమం శుక్రవారం మొఘల్ రాజపురంలోని సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో జరిగింది. విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు చెందిన 715 మంది విభిన్న ప్రతిభావంతులకు అవసరాలకు అనుగుణంగా మిగతా 2లో ...

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శనివారం సా॥ : 6:22
సహరి : ఆదివారం ఉ॥ 4:58

కారల్‌మార్క్స్ సిద్ధాంతాలను అనుసరించాలి

విశాలాంధ్ర-తిరువూరు: సీపీఐ కార్యాలయంలో సుంకర వీరభద్రరావు భవన్‌లో శుక్రవారం పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మూలనకు వ్యతిరేకంగా పోరాడిన కారల్ మార్క్స్ 142వ వర్ధంతి ఘనంగా జరిగింది. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య కారల్ మార్క్స్ చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. తూము కృష్ణయ్య మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉన్న మొత్తం సమాజం యొక్క చరిత్ర వర్గపోరాట చరిత్ర అని ఫ్రెడరిక్ ఎంగెల్స్‌తో కలిసి రాసి 1848లో ప్రచురించబడిన కమ్యూనిస్ట్ మానిఫెస్టో చెబుతుందన్నారు. మానవాళి యొక్క ప్రధాన సంఘర్షణ పాలకవర్గం లేదా కర్మాగారాలు, పొలాలు, గనులు వంటి ఉత్పత్తి సాధనాలను నియంత్రించే బూర్జువావర్గం, వారి శ్రమను అమ్ముకోవలసి వచ్చే కార్మికవర్గం లేదా శ్రామిక వర్గం మధ్య జరుగుతుందని మార్క్స్ నమ్మాడని గుర్తు చేశారు. ఈనాడు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలన్నీ నిర్వీర్యం చేసి ప్రైవేటు పరం చేసి పెట్టుబడిదారీ విధానాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ కారల్ మార్క్స్ సిద్ధాంతాలకు అనుగుణంగా పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్కే నాగుల మీరా, ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వర రావు, సీపీఐ తిరువూరు పట్టణ కార్యదర్శి మాలపాటిఉదయ్, ఎన్టీఆర్ జిల్లా ఏఐవైఎఫ్ కార్యదర్శి ఎస్కే సుభాని, బాణాల అశోక్, ముత్తయ్య, పాలకుర్తి సునీల్, తోట పిచ్చయ్య, యాకూబ్, బత్తుల వెంకటేష్, మాదాసు ప్రసాద్, గురు బ్రహ్మం, ఏఐటీయూసీ ఆటోవర్కర్స్ నాయకులు పాల్గొన్నారు.

మాణిక్యవేల్‌కు సీపీఐ నాయకులు నివాళి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు అరండల్‌పేటలోని వారి స్వగృహంలో ఉంచిన ట్రిబుల్ ఎక్స్ సోప్ సంస్థ అధినేత అరుణాచలం మాణిక్యవేల్ (అన్నాజీ) భౌతికకాయాన్ని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రిలు శుక్రవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాణిక్యవేల్ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాప, సానుభూతులు తెలియజేశారు. తన వ్యాపారాన్ని సైకిల్‌పై ప్రారంభించి అంచలంచెలుగా స్వయంకృషితో ఎదిగిన వ్యక్తి అరుణాచలం మాణిక్యవేల్ అని కొనియాడారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని, విశాఖ ఉక్కుకు సొంత గనులను కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, ఉద్యోగులకు బకాయి జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు లాడ్జిసెంటర్‌లో శుక్రవారం నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర పశ్చిమ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో ఉన్న మిగతా 2లో ...

బాలయ్యకు సీపీఐ నాయకుల నివాళి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : అనారోగ్య కారణంతో మృతి చెందిన ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వడ్డే బాలయ్య భౌతికకాయాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, సమితి సభ్యులు జి.సురేష్‌బాబు, ఆకిటి రామచంద్రుడు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

(మొదటి పేజీ తరువాయి)

రైతుల భూములను ఎండోమెంట్ పరిధి నుంచి మినహాయించాలి

ఈ మేరకు మల్లయ్యలింగంభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి గ్రామానికి చెందిన రైతులు సాగు చేసుకునే భూములను ఎండోమెంట్ పరిధి నుంచి మినహాయించాలని, అదేవిధంగా మేడికొండూరు మండలం జంగగుంటపాలెం, పెదకాకాని మండలం నంబూరు, పెదకాకాని, వెనిగండ్ల తదితర గ్రామాల్లో, జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతుల భూములను దేవదాయ శాఖ నుంచి మినహాయించాలని జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. 1956 నుంచి 1998, 2009 సంవత్సరాలలో భూములను అప్పటి మార్కెట్ ధర చెల్లించి కొనుగోలు చేసి పక్కాగా రిజిస్ట్రేషన్ పొందారని గుర్తుచేశారు. ఆనాటి నుంచి నేటి వరకు ఆ భూములలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారని చెప్పారు. వీరిలో ఎకరం, ఎకరన్నర భూమి కలిగిన పేద రైతులు ఉన్నారని అన్నారు. 2013లో వచ్చిన ఎండోమెంట్ చట్టం ప్రకారం వారి భూములను ఎండోమెంట్ పరిధిలోకి వస్తుందని ఆన్‌లైన్‌లో చూపిస్తూ చట్టం అమలు జరుపుతున్న విషయం రైతాంగానికి తెలియజేయకుండా కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా వారి ప్రమేయం కూడా లేకుండా చాప కింద నీరులా వారి పేర్లను రిజిస్టర్ నుంచి తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి హక్కులను హరించే విధంగా ఎండోమెంట్ శాఖ వ్యవహరించడంతో రైతులు భయాందోళన చెందుతున్నారని అన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని, పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర లేక రైతు అల్లాడిపోతున్నాడని, ప్రభుత్వం ఇస్తానన్న ముందస్తు పెట్టుబడి సాయం రూ.20 వేలు కేవలం ప్రకటనకే పరిమితమైందని ఇటువంటి పరిస్థితులలో ఎండోమెంట్ శాఖ ఇటువంటి దుర్మార్గానికి ఒడిగట్టడం శోచనీయమని అన్నారు. తక్షణమే ఆ భూములను ఎండోమెంట్ పరిధి నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో జరిగే సదస్సులో జిల్లాలోని రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.జగన్నాథం, రైతులు తలపనేని స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉంటాం

ఉచితంగా పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు వారి అవసరాలకు సరిపడా ఉపకరణాలు అందించటం చాలా సంతోషంగా వుందన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాగానే విజయవాడ ఎంపిగా తాను జిల్లాలోని ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ , జిల్లా అధికారులతో కలిసి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసేందుకు కృషి చేయటం జరిగిందన్నారు. రెండు నెలల క్రితమే వీటిని హైదరాబాద్ నుంచి తెప్పించటం జరిగింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల కొంత ఆలస్యం జరిగిందన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కేంద్రం నుంచి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు రావాల్సిన ఉపకరణాలు మంజూరు కోసం ఎంపి కేశినేని శివనాథ్ చూపిన చొరవ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపి బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజర్ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళ అధ్యక్షు రాలు, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు , అలింకో సంస్థ ప్రతినిధి రవిశంకర్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని అమ్మేస్తాని ప్రకటించి దానికి అనుగుణంగా చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలో పోరాడి సాధించుకున్న అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ ఉక్కు అని, దానిని గత 4 ఏళ్ళ క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరిస్తామని ప్రకటించిందని, ఆ ప్రకటనకు వ్యతిరేకంగా ఆ రోజు నుంచి అక్కడ ఉన్న కార్మికులే కాకుండా రాష్ట్ర వ్యాపితంగా ప్రజానీకం మద్దతుతో పోరాటం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకమని పైకి చెబుతున్నప్పటికీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న చర్యలను సమర్ధిస్తున్నాయని విమర్శించారు. విశాఖ ఉక్కుకు సొంత ముడి ఖనిజం గనులను కేంద్ర ప్రభుత్వం కేటాయించకపోవటం నష్టాలకు కారణమవుతుందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విరమించుకునేవరకు పోరాటం జరుగుతుందని, కార్మికులు, ప్రజలు ఈ పోరాటాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏఐఎఫ్‌టీయూ(న్యూ) నాయకులు కూరపాటి కోటయ్య, ఏఐకేఎం ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గనిరాజు, ఏఐటీయూసీ నాయకులు బుజ్జి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య ప్రసంగించారు. సీఐటీయూ నాయకులు బి.లక్ష్మణరావు, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు మరియదాసు, కట్లగుంట శ్రీనివాస రావు, వై.రమణ, చింతల శ్రీనివాసరావు, షేక్ ఖాశీం వలి, ఆది నికల్సన్, షేక్ ఖాశీం షహీద్, గండికోట శంకరరావు, ఆర్.రాజేశ్వరరావు, కూరపాటి రాంబాబు, నాగరాజు, దీవెనరావు, బాబురావు, ఐద్వా నగర కార్యదర్శి ఎ.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

శిథిలమవుతున్న పేదల టిడ్కో ఇళ్లు

విశాలాంధ్ర- ఉయ్యూరు : దశాబ్దాలుగా ఉయ్యూరు పట్టణంలో ఉన్న నివేశన స్థలాల కొరతను, పేదల సొంత ఇంటి కలను నెరవేర్చే ఉద్దేశంతో సుమారు దశాబ్దం క్రితం ప్రస్తుత ప్రభుత్వమే మూడు ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లకు శ్రీకారం చుట్టింది. సుమారు 2,600 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. గ్రామపంచాయతీ కాస్త నగర పంచాయతీ గా మారటం 40 వేలకు పైచిలుకి జనాభా ఉండటంతో నివాస ప్రాంతాలు కరువై పట్టణంలో దొరికిన చోట ఆక్రమించుకొని నివాసాలు ఏర్పరచుకున్న పేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చాలని సదుద్దేశంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం క్రింద నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేసి పథక నిబంధనలు ప్రకారం ఒక బెడ్ రూమ్ ఇళ్లకు ఒక రేటు రెండు బెడ్ రూమ్ల ఇళ్లకు మరొక రేటు నిర్ధారించి అందుకు సంబంధించిన బ్యాంకు డిపాజిట్‌లను లబ్ధిదారుల నుంచి సేకరించారు. పదవీ కాలం ముగియనుండటంతో మొక్కుబడిగా, అసం పూర్తి భవనాల్లో నివాసం కొరకు పేదలకు పట్టాలనందించారు. తర్వాత ప్రభుత్వ మారటం రీటెండరింగ్ విధానం ప్రవేశపెట్టడం ఫలితంగా అప్పటివరకు నిర్మాణం చేసిన కాంట్రాక్టర్లు తాము చేసిన పనులకు బిల్లులు అవ్వలేదని సాకుతో నిర్మాణ పనులు నింపు వేశారు. అయితే అప్పటికే సొమ్ము లను బ్యాంకుకు డిపాజిట్ చేసిన లబ్ధిదారులకు నిర్ణీత కిస్తీ సొమ్ము చెల్లించాలంటూ నోటీసులు ఇవ్వడం, బ్యాంకులో దాచుకున్న సొమ్మును వారు జమ చేసుకోవటం జరిగింది. లేని ఇంటికి, ప్రత్యక్షంగా చేయని అప్పుకు కిస్తీలు కట్టడం లబ్ధి దారులు అయోమయానికి గురిచేసింది. తిరిగి మళ్లీ ఎన్నికలు వచ్చాయి. అభ్యర్థులు మారారు. మళ్లీ లబ్ధిదారుల సమావేశం ఏర్పాటు చేశారు. న్యాయం చేస్తామని హామీలు ఇచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : శ్రీనివాసరావు

విశాలాంధ్ర-నందిగామ : ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ముందుకు సాగుతున్నారని ఆమె కృషికి నియోజకవర్గ ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నారని పట్టణ ఉపాధ్యక్షులు, 11వ వార్డు ఇన్చార్జి కొప్పాకుల (ఏ వన్) శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి తనదైన శైలితో వెంటనే సమస్యను పరిష్కార దిశగా పనిచేయటమే కాకుండా దీర్ఘకాలిక సమస్యలుగా ఉన్న అనేక సమస్యలను అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో సమయంలో ఎమ్మెల్యే సౌమ్య చేస్తున్న కృషిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మహిళలకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఎన్నో రకాల సేవలను ఆమె అసెంబ్లీ సాక్షిగా ప్రస్తావించారని పేర్కొన్నారు. అదే కాకుండా రహదారి ప్రమాదాలు, అగ్నిప్రమాద ఘటనలు, విషపు గాలుల ప్రభావం వంటి ఘటనలు చోటు చేసుకున్న సమయంలో బాధితులకు మొదటి గంటలో వైద్యం అందిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చని మంగళవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడారని, నందిగామ నియోజకవర్గం అత్యధిక భాగం నేషనల్ హైవేల ఉండటం వలన ఎన్నో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ట్రామా కేర్ సెంటర్ నందిగామలో ఏర్పాటు చేయడం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చు అని ఎమ్మెల్యే చేస్తున్న కృషికి నందిగామ ప్రజలు ముగ్ధులవుతున్నారని పేర్కొన్నారు.

మున్సిపల్ సొసైటీ లిమిటెడ్ కుంభకోణం పై విచారణ చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గుడివాడ : వైసీపీ హయంలో గుడివాడ నియోజకవర్గంలో జరిగిన అవినీతిని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి సిఐడి ఎంక్వైరీ కోరతానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మున్సిపల్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌లో జరిగిన కోట్లాది రూపాయల కుంభకోణాన్ని సొసైటీ కార్మికులు శుక్ర వారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే రాము స్వగృహంలో అయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్మికులతో కలసి సత్యనారాయణపురంలోని సొసైటీ కార్యాలయానికి వెళ్లిన రుణాల అవకతవకలపై గుమస్తా రాజును వివరణ అడిగారు. తాను నలుగురు సభ్యులకు చెందిన 40 లక్షలు వాడుకున్నానని, ఇతర సొసైటీ సభ్యుల రుణాల వివరాలన్నీ అధ్యక్షురాలుకే తెలుసని గుమస్తా తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వన్ టౌన్ పోలీసులు ఈ కేసును నమోదు చేసుకుని దార్యాప్తు చేయాల న్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లానన్నారు. జరిగిన అవినీతిని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి సిఐడి విచారణ చేయాల్సిందిగా కోరుతానని సభ్యులకు ఎమ్మెల్యే రాము తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, కార్మిక సంఘ నాయకుడు వడ్డాది నాగరాజు, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహనరావు, గడ్డం ప్రకాష్ దాస్, మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర- విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. విస్సన్నపేట, మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన జనసేన స్థూపాల వద్ద మండలపార్టీ అధ్యక్షుడు షేక్ యాసిన్ పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. జన సేన నాయకులు అడపా శ్రీనివాసరావు, నందమూరి వెంకటేశ్వరరావు, తోట కిశోర్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం

విశాలాంధ్ర -పమిడిముక్కల: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని ఎంపిడిఓ డి.వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి కాసాని వేద సుప్రజ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని అధికారులు తగిన సమాచారంతో సమయానికి రావాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

అమరావతికి స్పోర్ట్స్ యూనివర్శిటీ కి 142 ఎకరాలు కేటాయింపు

- విజయవాడలో పికిల్ బాల్ కోర్ట్‌ను ప్రారంభించిన ఎంపి కేశినేని , ఎమ్మెల్యే గద్దె

విశాలాంధ్ర- విజయవాడ స్పోర్ట్స్ : అమరా వతి రాజధాని ప్రాంతంలో 220 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్శిటీ రాబోతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అమరావతి స్పోర్ట్స్ యూనివర్శిటీ కోసం 142 ఎకరాల కేటాయింపు చేశారని, స్పోర్ట్స్ సిటీలోనే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణం కాబోతుందని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. విజయవాడ లోని సిద్ధార్థ నగర్ లో ది పికిల్ బాల్ రిపబ్లిక్ పేరుతో నూతనంగా ఏర్పాటు చేసిన పికిల్ బాల్ కోర్ట్ లను శుక్రవారం ఎంపి కేశినేని శివనాథ్ , ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తో కలిసి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం కాసేపు కోర్ట్ లో సరదాగా ఇద్దరు పికిల్ బాల్ గేమ్ ఆడారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మీడియా తో మాట్లాడుతూ అమరావతి రాజధాని ప్రాంతంలో స్పోర్ట్స్ అకాడమీలు రావాలి. గతంలో హైదరాబాద్ లో ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఏట్రో ఏషియన్ గేమ్స్ నిర్వహించటం వల్ల మౌలిక సదుపాయాలు కల్పించటం జరిగింది. అందువల్ల ఎన్నో స్పోర్ట్స్ అకాడమీ వచ్చాయి. పుల్లెల గోపిచంద్ అకాడమీ కూడా సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో వచ్చిందన్నారు. స్పోర్ట్స్ యూనివర్శిటీ అంటే క్రీడాకారుల నైపుణ్యాన్ని మెరుగు పర్చటమే కాదు. స్పోర్ట్స్ కి సంబంధించిన సపోర్టింగ్ స్టాఫ్, ఫిజియోథెరపిస్టులు, కోచ్ లకు ట్రైనింగ్ ఇచ్చే విధంగా వుండబోతుందన్నారు. అలాగే పికిల్ బాల్ కోర్ట్ ఏర్పాటు నిర్వహకులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి తోపాటు క్రీడాభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు నాయుడు కంకణం కట్టుకున్నారన్నారు. ఆరోగ్యానికి క్రీడలకు చాలా అవసరమని, నేటి యువతకి క్రీడలపట్ల బాగా ఆసక్తి పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పికిల్ బాల్ కోర్ట్ నిర్వహకులు డాక్టర్ వడ్లమూడి స్రవంతి, ప్రియ, ప్రశాంతి, టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లాహ్, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

16 న ఇగ్నో బి.ఎడ్, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) 2025 సంవత్సరానికి నిర్వహించే బి.ఎడ్, బీఎస్సీ నర్సింగ్ కోర్సులకు మార్చి 16వ తేదీ ఆదివారం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షను విజయవాడ ప్రాంతీయ కేంద్రం పరిధిలోని విజయవాడ, కొత్తపేటలో గల కాకరపర్తి భావనారాయణ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం ఇంచార్జ్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కె. సుమలత శుక్రవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. బి.ఎడ్, ప్రవేశ పరీక్ష 16న ఉదయం, బీఎస్సీ నర్సింగ్ మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ప్రవేశ పరీక్ష కు సంబంధించిన హాల్ టికెట్లు ఇగ్నో వెబ్సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలి పారు. ఇతర వివరాలకు కొత్తపేట హిందూహైస్కూల్ ప్రాంగ ణంలో గల ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని గాని లేదా కేబిన్ కళాశాలలోగల ఇగ్నో అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

యువకుడికి కృత్రిమ కాళ్ల ఏర్పాటుకై షేక్ గయాసుద్దీన్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): స్థానిక 41వ డివిజన్ దర్గా ప్రాంతానికి చెందిన ఆదిల్ అనే యువకుడికి కృత్రిమ కాళ్ల ఏర్పాటుకై రూ.20వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఐజా గ్రూప్ చైర్మన్ షేక్ గయాసుద్దీన్ (ఐజా) శుక్రవారం సాయంత్రం భవానిపురంలోని తనకార్యాలయంలో అందజేశారు. గయాసుద్దీన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో ఆదిల్ తన ఎడమకాలును కోల్పోయాడని, ఈ విషయాన్ని ఆయన మిత్రబృందం తన దృష్టికి తీసుకురావడం జరిగిందని అన్నారు. ఆదిల్‌కి ఆయన మిత్ర బృందం సహా యం చేస్తున్న విషయం తన దృష్టికి రావడంతో తన వంతు సాయంగా రూ.20 వేలు అందించారు. కార్యక్రమంలో ఐజా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, MALLULA SARASWATHI (Old Name), W/o. MALLULA GANESWARA RAO, resident of D.No. 4-147/1-1, GF-1, Sri Siri Residency, Bodavari Street, Ramavarapadu Village, Vijayawada Rural Mandal, NTR Dist, A.P -521108 I have Changed my name as DONGA SARASWATHI (New Name), W/o. MALLULA GANESWARA RAO, Hereafter my name is Known as DONGA SARASWATHI (New Name), W/o. MALLULA GANESWARA RAO, for all purposes.

కార్మికులకు, ఉద్యోగులకు భద్రత కల్పించండి

– జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి

విశాలాంధ్ర- గన్నవరం : గన్నవరం మండలం ముస్తాబాద గ్రామంలో నాలుగు సంవత్సరాల నుండి రిలాయన్ ట్రెండ్స్ కంపెనీ లో సుమారు 250 కాంట్రాక్ట్ ఉద్యోగులను ఏ నోటీసు లేకుండా తీసి వేస్తున్నారనీ, వీరికి ఉద్యోగ భద్రత కలించాలనీ, గన్నవరం జడ్పీటీసీ అన్నవరపు ఏలిజబెత్ రాణి ప్రభుత్వాన్ని కోరారు. ఆమె జిల్లా కలెక్టర్ కు లేఖ రాసి సదరు కంపెనీలో నాలుగు సంవత్సరాల నుండి వారు పని చేస్తున్నట్లు తెలిపారు. అప్పటినుండి ఎవరి డ్యూటీ వారు సక్రమంగా చేసుకుంటున్నారు. వీరికి రూ.13వేలు అని చెప్పి ఉద్యోగంలో తీసుకున్నారు. కానీ రూ.2వేలు పీయఫ్ క్రింద కటింగ్ చేస్తున్నార న్నారు. ఈ కంపెనీకి చుట్టూ ప్రక్కల గ్రామాలైన ముస్తాబాద సూరం పల్లి ఆదవినెక్కలం, పురుషోత్త పట్నం, నున్నా, సింగ్నగర్, రామవర ప్పాడు, తదితర గ్రామాలు నుండి మైలవరం, వెలగలేరు, లాంటి దూరప్రాంత తలనుండి ప్రతి రోజు షిఫ్ట్ వారిగా డ్యూటీలు చేస్తున్నారు. వీరిలో కొందరు హాస్టల్‌లో ఉంటున్నారు. ఇప్పటి వరకు లేబర్ ఆఫీస్ నుంచి ఏ అధికారి రాలేదన్నారు. కార్మికులు అత్యధిక్కులు దళితులు, గిరిజనులు, మైనారిటీ, వెనుకబడిన సామాజిక వర్గాల నుంచి వచ్చిన వారున్నారు. సదరు కార్మికులును కలెక్టర్ కలుగజేసుకొని సదరు సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రవీణ్, ఐశ్వర్య, సుమలత, కిషోర్, మౌనిక, ప్రసాద్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పేదరికాన్ని అధిగమించే ఆయుధం చదువు ఒక్కటే : రావెళ్ల

విశాలాంధ్ర-పెదపారుపూడి : పేదరి కాన్ని అధిగమించే ఆయుధం చదువు ఒకటేనని అందుకే ప్రతి ఒక్కరు చదువులో పోటీపడి ముందుకు సాగాలని ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు రావెళ్ల వరుణ కుమార్ శుక్రవారం అన్నారు. మండలంలోని మహేశ్వర పురం గ్రామంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఈనెల 17వ తేదీ నుంచి పరీక్ష రాసేందుకు ప్యాడ్ లు, పెన్నులు, ఎరాజర్, స్కేల్, రబ్బర్, తదితర కిట్లను తన సొంత నిధులు హెచ్చించి తన చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రావెళ్ల మాట్లాడుతూ తన చిన్నతనములో అనేక కష్టాలు పడి చదువుకుని ప్రభుత్వ పాఠశాలలో ఉద్యోగం చేస్తూ పెదపారుపూడి మండలం యలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి రిటైర్మెంట్ తీసుకుని తనకన్నా పేదరికంలో ఉన్న వ్యక్తులకు తన వంతు ఆర్థిక సహాయం, ముఖ్యంగా విద్యార్థులకు అనేక రకాలుగా ఉపయోగపడుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉన్నదని ఆయన వివరించారు. అరుంధతి బంధు సంక్షేమ సేవ మండలి రాష్ట్ర అధ్యక్షుడు పెదపూడి కాంతారావు, మర్ల రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం కూచిపూడి సెంటర్‌లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం మొవ్వ మండల అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణా జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ వేమూరి పరిశుద్ధ రాజు పాల్గొని మజ్జిగ పంపిణీ ప్రారంభిం చారు. వేసవి దప్పిక తీర్చటానికి చల్లటి మజ్జిగతో అంబేద్కర్ యూత్ సభ్యులు రాజకీయాలకు కులమతాలకు అతీతంగా నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో మొవ్వ సర్పంచ్ తూము పూర్ణచంద్రారావు, ప్రముఖులు కొండవీటి అమర బాలేశ్వరరావు, తూము అంబేద్కర్, రాజులపాటి రాఘవరావు, పులి వినోద్ బాబు, వీరబత్తిన రవి బాబు, సాలి సుకుమార్, అంబేద్కర్ యూత్ సభ్యులు పాగోలు రమేష్ బాబు, కూరపాటి బాలకృష్ణ, బండి సహదేవుడు, కైలా రామారావు,

వరిగంజి నాగేంద్రం, డెక్కా వీర నాగులు, మేరుగు శ్రీనివాస్, అన్నవరపు రవి, చిగురుపల్లి సుబ్రహ్మణ్యం, మద్దాల జయరాజు, నాదా విక్టర్‌పాల్, చిగురుపల్లి ఏడుకొండలు పాల్గొన్నారు.

కూచిపూడి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న పరీక్ష పత్రాలు

విశాలాంధ్ర-కూచిపూడి : ఈ నెల 17వ తారీకు నుంచి జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లకు చేరుకున్నాయి. దీనిలో భాగంగానే మొవ్వ మండలంలోని కూచిపూడి, పెదసనగల్లు, మొవ్వ, కోసూరు, కాజ పరీక్ష కేంద్రాలకు సంస్కృతంతో సహా 9 రకాల ప్రశ్నా పత్రాలుసెట్-1 కూచిపూడి పోలీస్ స్టేషన్‌కు, నిడుమోలు పరీక్షా కేంద్రానికి సంబంధించిన ప్రశ్నలు పత్రాలు గూడూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి వాటిని కస్టోడియన్, పరీక్ష కేంద్రాల సిఎస్, డిఓల సమక్షంలో పోలీస్ ఆఫీసర్స్ బాక్సులలో భద్రపరిచి సీల్ వేశారు.

పిఠాపురం సభకు భారీగా తరలిన జనసైనికులు

విశాలాంధ్ర-పామర్రు : పిఠాపురంలో శుక్రవారం జరిగిన జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభ కు పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ చార్జ్ తాడిశెట్టి నరేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయం నుంచి భారీగా ఐదు మండలాల జనసైనికులు 20కార్లు, ఒకట్రావెల్స్ బస్సులో బయలుదేరి వెళ్లారు. వాహనాలకు తాడి శెట్టి నరేష్ జెండా ఊపి ప్రారంభించారు.

పెదవోగిరాల 9 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

విశాలాంధ్ర-ఉయ్యూరు : మండలంలోని పెదవోగిరాల గ్రామంలో శుక్రవారం ఉయ్యూరు రూరల్ పోలీసులు దాడి చేసి 9 మంది పేకాట రాయూలని అరెస్ట్ చేశారు. పోలీసులు కథను ప్రకారం గ్రామంలో పేకాట శిబిరం నడుస్తున్నట్టుగా విశ్వసనీయవర్గాల సమాచారం అందుకున్న పోలీసులు శిబిరంపై దాడి చేసి 9 మంది పేకాటరాయలను రూ.74,650 నగదును, ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేకుండా చేపల చెరువుల నిర్మాణం

చేపలచెరువులు, ఇష్టానుసారం ఏర్పాటు చేసిన బోర్లు

విశాలాంధ్ర-విస్సన్నపేట : విస్సన్న పేట మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపల చెరువుల తవ్వకాలు యధేచ్ఛగా సాగుతున్నాయి. ఎన్నెస్పీ ఎడమకాలువ వేంపాడు మేజర్ కాలువ సమీపంలో నరసాపురం గ్రామం వద్ద సుమారు 18 ఎకరాల్లో పెద్దఎత్తున ఈ తవ్వకాలు సాగుతున్నాయి. ఇదే ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం గతంలో చింతలపూడి ఎత్తిపోతల పథకానికి అనుబంధంగా విస్సన్నపేట ఎత్తిపోతల పథకం నిర్మాణం కోసం సుమారు రూ.400 కోట్లు మంజూరు చేయగా, 70శాతం పనులు పూర్తి చేసి, నిలిపివేశారు. ఎన్టీఆర్ జిల్లాలో చేపల చెరువుల ఏర్పాటు, సాగుపై ప్రభుత్వం విధించిన నిషేధం కొనసాగుతోంది. ఎన్నెస్పీ కాలువ సమీపంలో చెరువులు ఏర్పాటు చేసి, కాలువల నుంచి నీటిని హైజాక్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ ఇబ్బడిముబ్బడిగా ఇష్టానుసారం బోర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా, పంచాయతీరాజ్, రెవిన్యూ, ఎన్నెస్పీ శాఖలు పట్టించుకోకపోవటం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. మత్స్య శాఖకు చెందిన జిల్లా అధికారులు ఈ మండలానికి ప్రత్యేకాధికారులుగా ఉన్నా, కనీసం కన్నెత్తిచూడకపోవటం విడ్డూరంగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా ఇక్కడ సాగుతున్న అనుమతి లేని చేపల చెరువుల ఏర్పాటు, సాగుపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పచ్చదనం - పరిశుభ్రత

విశాలాంధ్ర-విజయవాడ కార్పోరేషన్ : విజయవాడ భవానీ పురంలోని 43వ డివిజన్‌లో పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా ఆ డివిజన్ శానిటేషన్ అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా తీర్చిదిద్దుతున్నారు. డివిజన్‌లోని ఎర్రిన్ సన్ రోడ్డులోని ప్రధాన డ్రెయిన్ లో పూడికతీసి మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకిని తొలిగించారు. అదే డివిజన్‌లోని కబేళా రోడ్డులో రోడ్డుమార్జిన్‌లో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని తొలిగించి పరిశుభ్రపర్చారు. దీంతో స్థానికులు హర్షంవ్యక్తం చేశారు.

43వ డివిజన్‌లో కబేళా రోడ్డులో నాడు-నేడు

43వ డివిజన్‌లో ఎర్రిన్‌సన్ స్కూల్ రోడ్డులో నాడు-నేడు

చల్లపల్లి లయన్స్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిని సన్మానిస్తున్న చల్లపల్లి క్లబ్ ప్రతినిధులు

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి లయన్స్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకమని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. గవర్నర్ అధికారిక పర్యటన సందర్భంగా శుక్రవారం చల్లపల్లి లయన్స్ క్లబ్ మల్టీపర్పస్ సర్వీస్ సెంటరులో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 27 సంవత్సరాల నుంచీ చల్లపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల్లో 8వేల మందికి పైగా కంటిఆపరేషన్లు చేయించిన ఘనత చల్లపల్లి క్లబ్ ప్రతినిధులదేనన్నారు. చల్లపల్లిలో మల్టీపర్పస్ సర్వీస్ సెంటరు ఏర్పాటుచేసుకుని వినూత్న సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చల్లపల్లి క్లబ్ ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. లయన్స్ సేవా కార్యక్రమాల్లో మరింత

మంది ప్రజల్ని భాగస్వాములను చేయాలని కోరారు. చల్లపల్లిలో క్లబ్ ఏర్పాటుచేసిన నాటినుంచీ నేటివరకూ సేవలందిస్తున్న చార్టర్ సభ్యులను పేరుపేరునా పిలిచి లయన్స్ ఇంటర్నేషనల్ బ్యాడ్జీలతో సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు రాయపాటి రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వైపీసీ.ప్రసాద్, పాస్ట్ జీఏటీ వైస్ చైర్పర్సన్ సిహెచ్. శ్రీనివాసరెడ్డి, జీఎస్టి డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఎం.చక్రధర్, కొల్లి ఎన్విఆర్ కె.ప్రసాద్ రీజియన్ ఛైర్పర్సన్ ఉపద్రష్ట రాంబాబు, చల్లపల్లి క్లబ్ కార్యదర్శి కస్తూరి ప్రసాద్, కోశాధికారి ముమ్మనేని నాని, జిల్లా నేత నర్రా సాయిబాబు, మాజీ అధ్యక్షులు టి.సాంబశివరావు, ఎస్ఏ. భాషా, మోపిదేవి వెంకటేశ్వరరావు, కొల్లిపర మధు, వరదా హరిగోపాల్, కొక్కిలిగడ్డ మణిప్రభాకరరావు, దావులూరి ధనుంజయ రావు తదితరులు పాల్గొన్నారు. గవర్నర్ అధికారిక పర్యటన సందర్భంగా జరిగిన సేవా కార్యక్రమాల్లో చిరువ్యాపారులకు గొడుగులు, నిరుపేద వికలాంగురాలికి రూ.5 వేల నగదును గవర్నర్ శేషగిరి చేతులమీదుగా అందచేశారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గుడివాడ : సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి ప్రజల సంక్షేమమే ముఖ్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక 22వవార్డులో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైలు పేటలో ప్రజల నుండి సమస్యల అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే పలు సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకున్నారు. అనంతరం రాము మాట్లాడుతూ ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకునేందుకే వార్డుల వారీగా ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యల్లో అత్యధిక సమస్యలను తక్షణమే పరిష్కరించామన్నారు. ఆర్థికపరమైన సమస్యలను త్వరగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నాయకులు పంద్రాజు సాంబశివరావు, చేకూరు జగన్మోహనరావు, కొడాలి బాలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-గంపలగూడెం : తోటముల రింగ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసినటువంటి జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ చేసుకొని అనంతరం పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో జరిగే జనసేన పార్టీ 12 ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి స్వచ్ఛందంగా తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో మండలజనసేన పార్టీ అధ్యక్షులు చింతలపాటి. వెంకటకృష్ణ రావు, ప్రధాన కార్యదర్శి ఒట్టికుంట. కృష్ణ, గాదేవారిగూడెం గ్రామ సర్పంచ్ చెన్నా శ్రీనివాస రావు, బర్ల. బాలకృష్ణ, జరపాల. రామకృష్ణ,పత్రా. రవి, పదిలం. తిరుమల రావు, పూల. సత్యనారాయణ, బత్తుల. గణేష్, పసుపులేటి. మాధవ రావు, దండాల. తిరుపత రావు, సూరం శెట్టి. వాసు మాధవరావు స్వామి, గద్దల. వినయ్, వేల్పుల.గోపి, రామకృష్ణ, ఓరుగంటి. సురేష్, గారు. లింగ మర్ల కోటేశ్వరావు గోపాలస్వామి, మరీదు. వెంకటర రమణ, చింతలపాటి. మాధవ్ , జన సైనికులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-నందిగామ: ఎంతోమంది నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నియో జకవర్గ పరిధిలోని 37 మంది బాధితులకు సీఎం సహాయనిధి ద్వారా సుమారు 53 లక్షల 30 వేల 633 రూపాయలు చెక్కుల రూపంలో లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు అనంతరం ఆమె మాట్లాడుతూ పేద వర్గాలకు కూటమీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు రాజకీయాలకు అతీతంగా సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు వైద్య పరంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎందరికో సీఎం సీఎం సహాయనిధి వెన్నుదన్నుగా ఉంటుందని అన్నారు నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే వేలాదిమందికి సీఎం సహాయనిధి అందించిన ఘనత కూటమి ప్రభుత్వా నికి దక్కుతుందన్నారు సీఎం సహాయనిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు త్వరితగతిన సీఎం సహాయనిధి చెక్కులు అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే సౌమ్యకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి కూటమి నేతలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

శ్రీ రామలింగేశ్వర స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవం

ఆనాథోత్సవాలనడుమ నిర్వహించిన వసంతోత్సవం

విశాలాంధ్ర- కూచిపూడి : నాట్యాచార్యుల ఇలవేల్పైన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి 262వ వార్షిక కళ్యాణ మహోత్సవాలలో భాగంగా ఆరవ రోజైన శుక్ర వారం కూచిపూడిలో వసంతోత్సవ వేడుకలు వయస్సుతో సంబంధం లేకుండా చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు మహిళలతో సహా పాల్గొన్న ఈ వేడుకలను కులాల కతీతంగా నిర్వహించారు. యువత, నాట్య కళాకారులు రంగులు, రంగు నీళ్లు జల్లుకుంటూ కళ్యాణ దంపతుల ఉత్సవ మూర్తులను ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో చక్ర స్నానాన్ని నిర్వహించి చక్ర తీర్థాన్ని స్వీకరించారు. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న హోమాన్ని పూర్ణాహుతితో ముగించారు. అలాగే ఫాల్గుణ పూర్ణిమ కూడా కలిసి రావడంతో గ్రామ గ్రామాన హోలీ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. చిన్నారులు రంగులు జల్లుకుంటూ ఆనందంగా సందడిగా గడిపారు.

కూచిపూడిలో ముగిసిన నాట్య సంబరాలు

విశాలాంధ్ర- కూచిపూడి : డాక్టర్ వేదాంతంరాధేశ్యామ్ కూచిపూడి నాట్య శిల్పారామం, శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి పర్యవేక్షణలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత స్వామి వార్షిక కళ్యాణ మహో త్సవ అనుబంధ సాంస్కృతిక కార్యక్రమాలు నాలుగో రోజైన శుక్ర వారంతో ముగిశాయి. కూచిపూడి లోనిశ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళావేదికపై నిర్వహిస్తున్న నాట్య ప్రదర్శనలలో భాగంగా ప్రముఖ సంగీత సాహిత్య నాట్యాచార్య దండిభొట్ల వైకుంఠ నారాయణమూర్తి (హైదరాబాద్) శిష్యురాండ్రు సహస్ర, లిఖిత, శ్రియ, నందిని, త్రివేణీ, గీత ప్రదర్శించిన అంశాలు ఆహూతులను రజింపచేశాయి. శ్రీ గురు కృప సంగీత నృత్య కళా నికేతన్ (అనంతపురం) డైరెక్టర్ డాక్టర్ పట్నం శివప్రసాద్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ముగ్ధులనుగావించాయి. నిర్వాహకులు డాక్టర్ వేదాంతం రాధేశ్యాం ఆధ్వర్యంలో. కళాకారులను అంగ వస్త్రాలతో, ప్రశంసా పత్రాలతో, మెడల్స్‌తో సత్కరించారు.

వైసీపీలో బాధ్యుల నియామకం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: వైసీపీ బాధ్యుల నియామకాన్ని ఆ పార్టీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాస్ ప్రకటించారు. మండల పార్టీ అధ్యక్షునిగా మండలపరిషత్తు మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత ఎంపీటీసీ సభ్యుడు ఓలేటి దుర్గారావును నియమించారు. జిల్లా అధికార ప్రతినిధిగా విశ్రాంత అధ్యాపకుడు ముంగా జయరాజును నియమించారు. పార్టీ జిల్లా కార్యదర్శిగా విస్సన్నపేట మాజీ సర్పంచి, ఎస్సీ, ఎస్టీ సర్పంచుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు పల్లిపాం లక్ష్మయ్యను నియమిస్తూ, నియామకపత్రాలు అందజేశారు.

ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు: కోగంటి

విశాలాంధ్ర-కంచికచర్ల: సమైక్యతకు అద్దం పట్టే హోలీ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని కోగంటి అన్నారు. రంగుల పండుగ 'హోలీ' సందర్భంగా మండల ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోగంటి మాట్లాడుతూ అందరూ ఐకమత్యంగా జరుపుకునే హెూలీ పండుగ మన జీవితాల్లో కొత్త రంగులు నింపాలని, ఈ రంగుల పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. వసంత కాలంలో మన ఆరోగ్యం కోసం నిర్వహించు కునే హెూలీ పండుగను రసాయ నాలు ఉపయోగించి కలుషితం చేయవద్దని ప్రజలందరికీ కోగంటి విజ్ఞప్తి చేశారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలు జరుపుకునే ఈ పండుగ సమైక్యతకు అద్దం పడుతుందని అభిప్రాయపడ్డారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కోగంటి భరోసా ఇచ్చారు.

జనసైనికుల కోసం విస్తృతంగా భోజన ఏర్పాట్లు

విశాలాంధ్ర - చల్లపల్లి : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు అవనిగడ్డ నియోజకవర్గం నుంచీ తరలివెళుతున్న జనసైనికుల కోసం పార్టీ సీనియర్ నాయకులు అడపా రాంబాబు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. చల్లపల్లిలోని రాంబాబు స్వగృహంలో 12 వేల మందికి ఆహారం తయారు చేయించి ప్యాకింగ్ చేయించి మండలాల వారీగా వాహనాలకు అందచేశారు. శుక్రవారం తెల్ల వారుజామున యువనేత మండలి వెంకట్రామ్ పరిశీలించారు. అడపా రాంబాబు సహకారం అభినందనీయమనీ, వాహనాల్లో తరలివెళ్లే జనసైనికులకు ఆహారం అందించేలా ఏర్పాట్లు చేయటం పై అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దలు ఆకుల స్వభూప్రసాద్, జనసేన నేతలు రావులపల్లి పండు గురుస్వామి, గంగిశెట్టి రాజేంద్ర, ఎం.రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన లోకేష్ దంపతులు

విశాలాంధ్ర-మంగళగిరి : యుగ యుగాల దేవుడు మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన స్వామి వారి కల్యాణ మహోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మణి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి ప్రభుత్వం తరఫున నారా లోకేష్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయి ద్యాల మధ్య వైభవంగా జరిగిన స్వామి వారి కల్యాణాన్ని కనులారా వీక్షించి స్వామివారి అనుగ్రహం పొందారు. మంత్రి నారా లోకేష్ దంపతులకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నటి ఉదయభానుకు సన్మానం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రముఖ సినీ, టీవీ నటి ఉదయభానును ఇవివి యువ కళావాహిని అధ్య క్షులు వెచ్చా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. విద్యానగర్‌లోని ఓ ప్రైవేట్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెచ్చా కృష్ణమూర్తి ఉదయభానును సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఇవివి యువ కళావాహిని విశిష్ట మహిళ పురస్కారాన్ని ఉదయభానుకు అందజేశారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ పురస్కారాలే నటులకు ప్రేరణ అన్నారు. వెచ్చా కృష్ణ మూర్తి మాట్లాడుతూ ఉదయభాను నటిగా మరిన్ని ఉన్న త శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సభ్యు లు రఘు, పి.కిరణ్, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ పండుగ

విశాలాంధ్ర-తెనాలి : పట్టణంలో పరిసర ప్రాంతాలలో హోలీ పండుగ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. తెనాలి బుర్రిపాలెంలోని సుగాలి కాలనీలో పెద్దలు, యువతీ యువకులు, బాలబాలికలు ఆనందంగా గంతులు వేస్తూ హోలి రంగులు చల్లుకున్నారు. ఆహ్లాదకరంగా ఉత్సాహంతో గెంతులు వేశారు. ప్రధాన కూడళ్ళలో జానపద నృత్యాలు ప్రదర్శించారు. చెంచుపేట, చినరావూరు, సుగాలీ కాలనీలలో ఉదయం నుండి సాయంత్రం వరకు హోలి పండుగ ఉత్సవాలు నిర్వహించుకున్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు జిల్లాలోని పాఠశాలలకు ఈ నెల 15వ తేది నుంచి ఏప్రిల్ 24వ తేది వరకు ఒంటిపూట బడులు నిర్వహిం చాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఒక ప్రకటన లో తెలిపారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యా హ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహిం చాలన్నారు. పదవ తరగతి పరీక్షా కేంద్రాలున్న పాఠశా లలు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు పెట్టాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్టిలో పెట్టుకుని పాఠశాలల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు.

18న పాటిబండ్ల దక్షిణామూర్తికి సత్కారం



విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ప్రసిద్ధ అభ్యుదయ సాహితీవేత్త, అరసం నేత డాక్టర్ పరుచూరి రాజారామ్ జయంతిని పురస్కరిం చుకుని 2003 సంవత్సరం నుంచి నిర్వహిస్తున్న అమరజీవి డాక్టర్ పరుచూరి రాజారామ్ సాహితీ సత్కా రాన్ని ఈ సంవత్సరం తెనాలి పట్టణా నికి చెందిన ప్రముఖ వైద్యులు, పాపు లర్ సైన్స్ రచయిత డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తికి నిర్వహిస్తున్నట్లు అరసం గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకు మల్లి సింగా ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ పరుచూరి రాజారామ్ 85వ జయంతి సందర్భంగా ఈ నెల 18న సాయంత్రం 6 గంటలకు గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లో గల డిస్ట్రిక్ట్ సీని యర్ సిటిజన్స్ సర్వీసు ఆర్గనైజేషన్ ప్రాంగణంలో అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అధ్యక్షత న జరుగుతుంద న్నారు. ఈ సభలో డాక్టర్ దక్షిణామూర్తిని రూ.10 వేలు నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరిస్తా రని చెప్పారు. అరసం జాతీయ అధ్య క్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ సభలో ఆప్తవాక్యం పలుకుతారని వెల్లడించారు.

దక్షిణామూర్తి జీవిత విశేషాలు

వైద్య రంగంలో, సాహిత్య సాంస్కృతిక రంగాలలో తెనాలి కేంద్రంగా 70 సంవత్సరాలుగా కృషి చేస్తున్న డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి 1939 సెప్టెంబర్ 2న కృష్ణా జిల్లా గుంటుపల్లి గ్రామంలో జన్మించారు. వివిధ పత్రి కలలో వైద్య విజ్ఞానం సాధారణ ప్రజ లకు అర్థమయ్యే రీతిలో వందలాది వ్యాసాలు రాశారు. జీవశాస్త్ర విజ్ఞానం, డాక్టర్ గారి డైరీ, వైద్య విజ్ఞానం, డయాబెటిస్ గైడ్, తెలుగులో ఉత్తమ చిత్రాలు, గుండె జబ్బులు-నివారణ, అధిక రక్తపోటు, కళా దర్శకుడు బీఎన్ రెడ్డి మొదలగు పుస్తకాలు రచించారు. తెనాలి ఐఎంఏకు కార్యదర్శిగా, అధ్యక్షు లుగా సేవలందించారు.

2015లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం, 2016లో ఇండియన్ కాలేజీ ఆఫ్ ఫిజిషియన్స్ నుంచి ఫెలోషిప్ స్వీకరించారు. 2017లో విజయవాడ రూట్సు ఫౌండేషన్ వారి నుంచి జీవితకాల సాధన అవార్డు పొందారు.

స్మార్ట్ విలేజ్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం

విశాలాంధ్ర-తాడేపల్లి : పర్యావ రణ పరిరక్షణలో భాగంగా గుండిమెడ గ్రామంలో పెద్ద ఎత్తున చెట్ల నాటే కార్యక్రమం నిర్వహించినట్లు కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ సాక్ డైరెక్టర్ పి.సాయి విజయ్ శుక్రవారం ఒక ప్రక టనలో తెలిపారు. కెఎల్ విశ్వవిద్యా లయం విద్యార్థులు, గ్రామస్తుల భాగ స్వామ్యంతో స్మార్ట్ విలేజ్ రెవల్యూషన్ డొమైన్ గ్రీన్ ఇన్నోవేషన్‌లో భాగంగా జీవ వైవిధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యత పెంచడం కోసం గ్రామం లోని అంగన్వాడి పాఠశాల, గ్రామ మైదాన ప్రాంతంలో కీలక ప్రదేశాలలో మొక్కలు నాటి వాటి ప్రాముఖ్యత గురించి గ్రామస్తులు అందరికీ అవగా హన కల్పించారు. ఈ సంద ర్భంగా సాయి విజయ్ మాట్లాడుతూ బాధ్యతా యుతమైన పౌరులుగా, పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా స్మార్ట్ విలేజ్ రెవల్యూ షన్ కోఆర్డినేటర్లు పి.వి. సత్యనారా యణ, టి.శివ కృష్ణ సారథ్యం వహిం చగా కార్యక్రమం నిర్వహించినందుకు విద్యార్థులను, స్మార్ట్ విలేజ్ రెవల్యూషన్ కోఆర్డినేటర్లను వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కే.సుబ్బా రావు, విద్యార్థి సంక్షేమ విభాగ ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, సాక్ డైరెక్టర్ పి.సాయి విజయ్ తదితరులు అభినందించారు.

18న ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తెనాలి : ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కమిటి ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన గుంటూరు రీజినల్ ఈపీఎఫ్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని అసోసియేషన్ నాయకులు పిలుపు నిచ్చారు. శుక్రవారం చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ జిల్లా కమిటి ప్రధాన కార్యదర్శి కె.బి.ప్రసాద్ మాట్లాడారు. 1995లో కేంద్రప్రభుత్వం తెచ్చిన పెన్షన్ స్కీము కార్మికులకు నష్టదాయక మని చెప్పారు. ప్రతి నెలా కార్మికుని జీతంలో 8.33 శాతం మినహాయించ ుకుని ఇపిఎఫ్ సంస్థ దానిపై వచ్చే వడ్డీ కంటే తక్కువ పెన్షన్ ఇచ్చి కార్మికుల కష్టార్జితాన్ని కొల్లగొడుతున్నా రని దుయ్యబట్టారు. 30 సంవత్సరాలు గడిచినా ఒక్కరూపాయి కూడా పెన్షన్ పెంచలేదని, వెయ్యి రూపాయలతో కార్మికులు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. అఖిలభారత స్థాయిలో కోఆర్డినేషన్ కమిటి ఏర్పరుచుకుని పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. గత నాలుగు సంవత్సరాలుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వేలాది పెన్షనర్లు ధర్నా చేసి యంపిలకు, కేంద్ర ప్రభుత్వానికి ఎన్ని అర్జీలు పెట్టినా కేంద్రం స్పందించలేదని చెప్పారు. కనీస పెన్షన్ నెలకు 9వేలు, ప్రతి ఆరు నెలలకు విడిఏ, కుటుంబ వైద్య సౌకర్యం తదితర రాయితీలు లెక్కకట్టి పూర్తి జీతానికి పూర్తి పెన్షన్ ఇవ్వాలనే తదితర కోర్కెల సాధనకు చేయతలపెట్టిన ధర్నాలో పెన్షనర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటి అధ్యక్షుడు కె.శివశంకరరావు, కుర్రా రమణ, షేక్ హుస్సేన్ వలి, కె. దుర్గాప్రసాద్ తదితరులు మాట్లాడారు.

సమస్య పరిష్కరించటం ప్రభుత్వ బాధ్యత

విశాలాంధ్ర-తాడేపల్లి : వందలాది కుటుంబాలతో ముడిపడి ఉన్న ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని యూనియన్ నాయ కులు కూరపాటి స్టీవెన్ తెలిపారు. న్యాయంగా తమకు రావాల్సిన నష్టప రిహారం కోసం కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 101వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కె.వి మోహనరావు, సిహెచ్ పిచ్చయ్య, ఆర్ ఇస్రాయేల్, కె ఆదినారాయణ, ఎం గురవయ్య కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో ఎం.ఆశీర్వాదం, డి.మాణిక్య రావు, బి.అంకయ్య, వై.సాల్మన్, వై.యెహోషువ, షేక్.సుభాని, వై.సుబ్బారావు, ఎండి రహీంతుల్లా, సాంబయ్య, టి.దుర్గా భవాని, వై.రమా దేవి, షేక్.ఇమాంబి, ఈ.సారమ్మ, ఎం.శివకుమారి, వి.రిబ్కా, డి. మల్లేశ్వరి, ఎస్.శాంతమ్మ, దీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలే విజయానికి సోపానాలు: వంగా

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: కృషి, దీక్ష, పట్టుదలలే విజయానికి సోపానాలు అని, క్రమశిక్షణ, సమయపాలన విద్యార్థుల విజయానికి మూల స్తంభాలు అని వీవీఆర్ విద్యాసంస్థల అధినేత వంగా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఏటుకూరు రోడ్డులో గల వీవీఆర్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు అద్భుతమైన విజయాలు సాధించా లని, ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని ఆకాంక్షిం చారు. ప్రిన్సిపాల్ వంగా రాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులకు ఇప్పటినుంచే మంచి లక్ష్యాలు ఉండాలని, ఆ లక్ష్యం కోసం ఎంతటి కష్టమైన ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర-తాడికొండ : నిడుముక్కల గ్రామంలోని దర్గా ఎదురుగా పంట పొలాల్లో అక్రమంగా నిలువ చేసిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, సివిల్ సప్లై అధికా రులు గురువారం రాత్రి పట్టుకున్నారు. గ్రామంలో బియ్యం నిల్వల విషయం అధికారుల దృష్టికి చేరింది. ఈ నేపథ్యంలో అధికారులు దాడులు నిర్వహించి 8 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని 12వ షాపుకు అప్పగించినట్లు తెలిసింది. అధికారులకు నెలసరి మామూలు అందకపోవడంతో దాడులు నిత్య కృత్యంగా మారాయని గ్రామస్తులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. వివరణ కోరేందుకు ప్రయత్నించగా సివిల్ సప్లై డి.టి. దేవరాజు అందుబాటులోకి రాలేదు.

రేపు ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం

విశాలాంధ్ర-తాడికొండ : మండల కేంద్రమైన తాడికొండ శ్రీ గిరీశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతోం దని దేవస్థాన కార్యనిర్వహణాధికారి జీ.వి. నారాయణ శుక్రవారం తెలిపారు. నేడు నిత్య పూజా విధులు, వాస్తు పూజ, శ్రీ గణపతి హోమము, ప్రసాద వినియోగం, విగ్రహాలను, ధ్వజ స్తంభమున నీటితో శుభ్రం చేయుట మొదలగు కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. భక్తులు గమనించాలన్నారు.

కాలువలో పడి విద్యార్థి మృతి

విశాలాంధ్ర-పెదకాకాని : కాలువలో పడి విద్యార్థి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నంబూరు గ్రామం లో జరిగింది. అంబేద్కర్ నగర్‌కు చెందిన దాసరి జాషువా(12) శుక్రవారం సెలవు దినం కావడంతో తన తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటూ పక్కనే ఉన్న గుంటూరు ఛానల్‌కి వెళ్ళాడు. సరదాగా నీటిలోకి దిగడంతో కాలుజారి కాలువలోకి పడిపోయాడు. తనతో ఆడుకునే చిన్నారులు స్థానికులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చేసరికి బాలుడు తుదిశ్వాస విడిచాడు. బాలుడు మృతి పట్ల గ్రామ ప్రజలు తీవ్ర విషాదం వ్యక్తం చేశారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

విశాలాంధ్ర-మాచర్ల : ఈ నెల ఆర్టీసీ డిఎం కార్యాలయంలో 15న "డయల్ యువర్ డీఎం" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి తెలిపారు. శుక్రవారం డీఎం వీరస్వామి విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంతో ప్రయాణి కుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. వివరా లకు సెల్ నెం.9959225432 ను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. డిపో పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వరల్డ్ ల్యాబ్ టెక్నీషియన్ డే వేడుకలు

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా ల్యాబ్ అండ్ ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ ల్యాబ్ టెక్నీషియన్ డే వేడుకలను ప్రెసిడెంట్ వట్టికొండ సాంబశివరావు ఆధ్వర్యంలో జిల్లా ఆఫీసు, అరండల్ పేట, చైతన్య గ్రామీణ బ్యాంక్ క్రింద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల, దాచేపల్లి, కారంపూడి, సత్తెనపల్లి, నరసరావుపేట అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు ప్రెసిడెంట్ వట్టికొండ సాంబశివరావుతో కేక్ కట్టింగ్ చేసి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులకు జిల్లా సెక్రటరీ గంజి శ్రీనివాసరావు.ట్రెజరర్ చల్లా శివలింగయ్య ధన్యవాదాలు తెలిపారు.

మట్టి ఖర్చులకు సాయం

విశాలాంధ్ర-నరసరావుపేట: స్థానిక నరసరావుపేట పట్టణం లోని 15వ వార్డు వరవకట్టకు చెందిన షేక్ ఆషాబి అనే ముస్లిం మహిళ తీవ్ర అనారోగ్యంతో మరణించారు. ఆమె ఒంటరి మహిళ, బంధువులు ఎవ్వరూ లేకపోవడంతో పరిస్థితి తెలుసుకున్న అనంతరం స్థానిక నరసారావుపేట ఎమ్మెల్యే డా॥ చదలవాడ అరవిందబాబు సహాయ సహకారాలతో నరసరావుపేట ఖబరాస్తాన్ అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ షేక్ మీరావలి మరణించిన మహిళ అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.3వేలు ఆర్థిక సహాయం అందించారు. నరసరావుపేట షాధీఖానా కమిటీ సభ్యులు షేక్ ఖాసిం (బడేబాబు) కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ లోడు క్రమబద్ధీకరణపై రాయితీ

విశాలాంధ్ర - దాచేపల్లి : గృహ అవసరాల కోసం వాడుకుంటున్న విద్యుత్ అదనపు లోడును క్రమబద్ధీకరణ చేసుకునే వినియోగదారులకు ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు ఏఏఓ సందీప్ కుమార్, జేఏఓ ఆశీర్వాదం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఇచ్చే ఈ 50 శాతం రాయితీ కోసం మార్చి 1 నుంచి ప్రారంభమైన ఈ దరఖాస్తు ప్రక్రియ జూన్ 30 వరకు చేసుకునే అవకాశం ఉందన్నారు. తగిన చార్జీలను చెల్లించి తాము ఇళ్లలో వాడుకునే అదనపు లోడును క్రమబద్ధీకరించు కోవాలని వివరించారు. కావున ఆన్ లైన్, మీ సేవ కేంద్రం, విద్యుత్ కార్యాలయాల్లో అధికారులను కలిసి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని వినియోగదారులను కోరారు.

అమ్మవారికి జలబిందెలతో అభిషేకాలు

విశాలాంధ్ర - దాచేపల్లి : శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయ అష్టమ వార్షికోత్సవంలో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారికి జలబిందెలతో అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీ దేవి అలంకరణ చేసిన అమ్మ వారిని 108 కలశాలతో ఆర్య వైశ్య మహిళల ఆధ్వర్యంలో గ్రామోత్సవం చేశారు. శ్రీలక్ష్మి జనార్ధనస్వామి వారి కల్యాణాన్ని కనుల పండువగా చేశారు. అదేవిధంగా ముత్యాలంపాడు రోడ్డులోని శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వామి వారి ఆలయ 14వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులుగా జరుగుతున్న కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. నెల పొంగళ్ళు చేశారు. వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్టించారు. యగాలు చేశారు

జనసేన ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నగర జనసేన పార్టీ కార్యదర్శి కొత్తకోటి ప్రసాదు ఆధ్వర్యంలో శ్రీనివాసరావు తోట శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గుడి వద్ద జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అళ్ళ హరి, బీజేపీ నాయకులు ఎ.రంగా, జూపూడి భవాని, తెలుగుదేశం నాయకులు నాగూర్ వలీ, సుభాని, మాజీ కార్పొరేటర్ వంజరపు రత్నకుమారి, జనసేన డివిజన్ అధ్యక్షులు దాసరి వెంకటేశ్వరరావు, చందు, శ్రీనివాసరావు, శ్రీకాంత్, చింతకాయల శివ, సోము, ఉదయ్ కుమార్, యుగంధర్, రామిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధించాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసన సభ్యులు జీవీ ఆంజనేయులు కోరారు. వినుకొండ పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వినుకొండ పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులో గల హర్ష స్కూల్లో స్వచ్ఛభారత్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం ప్రమాదకరమని, 100 మైగ్రేన్ ఉన్న ప్లాస్టిక్ భూమిలో కరగకపోవటంతో కాలుష్యం పెరుగుతుందని, తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం పాల వడం, ఆవులు, అనేక జీవ ప్రాణులు మరణిస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ వాడకం వచ్చే కాలుష్యంతో అనేక ప్రమాదాలు ఉన్నాయని, ప్రజలందరూ ఐక్యంగా ప్లాస్టిక్ వాడకండి నియంత్రించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. వినుకొండ ప్రాంతంతో పాటు పల్నాడు జిల్లాలో వ్యాపారులందరూ ప్లాస్టిక్ విక్రయాలను వెంటనే నిలిపివేయాలని ఆయన కోరారు. ప్లాస్టిక్ నియంత్రణలో ప్రభుత్వం నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలందరూ కలిసి ప్లాస్టిక్ వాడకం నియంత్రించి స్వచ్ఛాంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, పీవీ సురేష్ బాబు, షమీం, పి. అయూబ్ ఖాన్, కూటమి పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర - రెంటచింతల : ఏఎస్ డబ్ల్యూవో గురజాల పరిధిలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలలో పదో తరగతి అభ్యసిస్తున్న 110 మంది విద్యార్థినీ విద్యార్థులకు స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పరీక్ష ప్యాడ్లు, రిస్ట్ వాచ్‌లు పంపిణీ చేశారు. ఏఎస్ డబ్ల్యూవో టి వి సుజాత కుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పరీక్ష ప్యాడ్లను స్థానిక స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు నాయక్, పెద్ది ప్రభావతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మారుతి నాగార్జున, సత్యవతి దంపతుల సహకారంతో రిస్ట్ వాచ్‌లు విద్యార్థులకు అందజేశారు. ఏఎస్ డబ్ల్యూవో మాట్లాడుతూ క్రమం తప్పకుండా శ్రమిస్తే కష్టానికి తగ్గ ఫలితం వస్తుందని, విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాల న్నారు. బంగారు భవితకు పునాది వంటిదైన పదో తరగతి పరీక్షలు బాగా రాసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డెన్లు జె అరుణ కుమారి,నూరుల్లా బేగ్, గోపాల్ నాయక్, మాధవి లత, శిరోమణి, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ల సత్రం అధ్యక్షుడిగా అంజిరెడ్డి

విశాలాంధ్ర-రెంటచింతల: సత్రశాల మల్లయ్య స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించటమే లక్ష్యంగా పనిచేస్తానని గొట్టం అంజిరెడ్డి అన్నారు. సత్రశాలలో శివ భక్త కుంటిమల్లారెడ్డి స్వామి అన్నదాన సత్రం నూతన అధ్యక్షుడిగా అంజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. సుమారు 25 ఏళ్ల క్రితం స్థాపించిన అన్నదాన సత్రంలో దాతల విరాళాలు సుమారు రూ. 30 లక్షల వరకు సమకూరినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో విరాళాల సొమ్ము రూ. 50 లక్షలకు పెంచి వడ్డీ సహాయంతో అన్నదాన సత్రం నిర్వహించాలని కమిటీ భావిస్తున్నట్లు తెలిపారు. నూతన ఉపాధ్యక్షుడిగా గాదె రామిరెడ్డి, కార్యదర్శిగా మందలపు వెంకటరెడ్డి, కోశాధికారిగా నెమలి సీతారామిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాజీ అధ్యక్షుడు బరువు శ్రీనివాసరెడ్డి ప్రకటించారు

అమ్మవారి సేవలో పల్నాడు ఎస్పీ

విశాలాంధ్ర- దుర్గి: తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రం, మహాశక్తి పీఠం అడిగోప్పుల శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారిని శుక్రవారం పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కుటుం బ సభ్యులు దర్శించుకున్నారు. ఆయన కుటుంబ సమేతంగా దేవస్థానం వద్దకు విచ్చేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఎస్పీ కుటుంబ సభ్యులకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం శాలువాలతో సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

అమ్మవారి తిరునాళ్ళకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఈనెల 23 అమ్మవారి తిరునాళ్ళ (జాతర) సందర్భంగా వచ్చే వారం దరూ తప్పని సరిగా పోలీసు వారి ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. పోలీసు అధికారులు, దేవస్థానం అధికారులతో ఆయన సమావేశమయ్యారు. అమ్మవారి తిరునాళ్ళకు రాష్ట్ర నలుమూలల నుంచి మాత్రమే కాకుండా తెలంగాణ రాష్ట్రం నుండి కూడా భక్తులు వేల సంఖ్యలో అమ్మవారిని దర్శించుకోవడానికి వస్తారని,దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు అమ్మవారిని స్వేచ్ఛగా దర్శనం చేసుకుని తిరిగి స్వగృహాలకు వెళ్ళడానికి పోలీసు శాఖ తరుపున చర్యలు చేపడుతున్నామని అన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో రైతులను భాగస్వామ్యం చేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రకృతి వ్యవసాయ 2025 వార్షిక కార్యచరణ ప్రణాళికలో ప్రతి ఒక్క రైతును భాగస్వామ్యం చేయాలని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి అన్నారు. మూడు రోజుల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్ జూమ్ వీడియో కాల్ ద్వారా ప్రస్తుతం రసాయన వ్యవసాయం వల్ల పర్యావరణానికి కలుగు నష్టం అదేవిధంగా వాతావరణ అత్యవసర స్థితి గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని వ్యవసాయ, డిఆర్డిఏ, ఉపాధి హామీ, సెరికల్చర్, హార్టికల్చర్, మొదలగున్న అన్ని శాఖల సమన్వయంతో కలిసి ప్రణాళికను తయారు చేసుకోవాలని అన్నారు. అడిషనల్ డిపిఎం ప్రేమ్ రాజు మాట్లాడుతూ ప్రతి గ్రామ సమైక్య సంఘం పరిధిలో ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా ప్రకృతి వనరుల కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు ఘనజీవామృతం, నీమాస్త్రం, పంటలకు కావాల్సిన కషాయాలు ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలియపరిచారు. స్టేట్ ట్రైనర్ (ఎన్ ఎఫ్ ఏ) శాంతి, పల్నాడు జిల్లా ట్రైనర్ సైదయ్య, ఎన్ఎఫ్ఏలు నందకుమార్, అప్పలరాజు, సౌజన్య ,మేరీ ,స్వాతి, మాస్టర్ ట్రైనర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వామివారికి ఎమ్మెల్యే పూజలు

విశాలాంధ్ర- మాచర్ల : హరిహర సుతుడు అయ్యప్ప స్వామి పుట్టిన రోజును శుక్రవారం పట్టణంలోని మాత అన్నపూర్ణేశ్వరి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు స్వామి వారికి పంచా మృతాలతో నిర్వహించే అభిషేకాలను తిలకరించారు.

ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - కారంపూడి : మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ్ ఆంధ్ర - స్వర్ణాంధ్ర డే జరుపుతున్నందున ప్రతి గ్రామపంచాయతీలో గ్రామసభ నిర్వహణ, ర్యాలీలు, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం, తడి చెత్త పొడి చెత్త వేరు చేయటం, దానిని ప్రాసెస్ చేసి సంపద సృష్టించటం వంటి కార్యక్రమాలను చేపట్టాలని స్వచ్ఛభారత్ కారంపూడి మండల కోఆర్డినేటర్ కె సుబ్బారావు తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

ఇటీవల గ్రామాలలో మరుగు దొడ్ల కోసం అర్జీలు పెట్టుకున్న వారికి, అప్లికేషన్లు పెట్టుకున్న ప్రతి గ్రామంలో కనీసం 10 మరుగుదొడ్లకు మార్కింగ్ ఇవ్వాలని, ఈ ఫోటోలు అన్నీ కూడా యాప్ లో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అప్లోడ్ చేసి, ప్రజా ప్రతినిధులను ప్రజలను భాగస్వామ్యం చేయాలని కోరారు.

సిమెంట్ బల్లల వితరణ

విశాలాంధ్ర- పెదకూరపాడు: ఉదయం సాయంత్రం వేళల్లో నడకకు వచ్చే వాకర్స్ విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా మాజీ సర్పంచ్ అర్తిమల్ల నళిని స్మారకార్థం ఆమె భర్త జిల్లా టిడిపి కార్యదర్శి, పెదకూరపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అర్తిమళ్ల రమేష్ సొంత నిధులతో 10 సిమెంట్ బల్లలు సమకూర్చారు. ఐదేళ్ల వైకాపా పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురికావడంతో అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రత్యేక చొరవతో నడక మార్గం కాస్త నేడు కొత్త రూపు సంతరించుకుంది.

తాగునీటి చెరువు నడకమార్గం పై శుక్రవారం నరక మార్గంలోని పలు ప్రదేశాల్లో వాటిని బిగించారు... చెరువు కట్టపై నడక మార్గం అభివృద్ధికి కృషిచేసి మౌలిక వసతులు కల్పిస్తున్న రమేష్ కు వాకర్స్ కృతజ్ఞతలు తెలిపారు.

తపాలా కార్యాలయ నిర్మాణ పనులు షురూ

విశాలాంధ్ర - దాచేపల్లి : తపాలా కార్యాలయం కోసం పాతికేళ్ళుగా ఎదురు చూస్తున్న దాచేపల్లి ప్రజల కల నెరవేరబోతోంది. పడకన పడిన ఈ కార్యాలయ నిర్మాణ పనులు ఉన్నతాధికారులు తాజాగా చేపట్టారు. నరసరావుపేట పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటస్వామి జోక్యంతో కార్యాలయం పనులు ప్రారంభమయ్యాయి. పది సెంట్ల స్థలంలో రూ 45 లక్షలతో పనులు జరుగుతున్నాయి. ప్రారంభ దశలో ఉన్న వీటి పనులను సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

రథోత్సవంలో లోకేష్, పెమ్మసాని

విశాలాంధ్ర-మంగళగిరి : వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దివ్య రథోత్సవంలో విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్, కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. జై నారసింహ, గోవింద నామస్మరణల మధ్య రథాన్ని లాగారు. స్వామివారి దివ్యరథోత్సవాన్ని వీక్షించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అంతకుముందు దేవాలయ ప్రాంగణానికి చేరుకున్న లోకేష్, చంద్రశేఖర్లకు ఆలయ అధికారులు, పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు.

కారల్ మార్క్స్ ఆశయ సాధనకు కృషి: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ప్రపంచ మేధావి కారల్ మార్క్స్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ సోషలిస్టు గ్రంథ రచయిత, మార్క్సిస్టు మహామహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ 142వ వర్ధంతి సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు అధ్యక్షతన శుక్రవారం గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లో జరిగింది. మార్క్స్ చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పూలమాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన్న ఆంజనేయులు, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు జి.సురేష్ బాబు, మంగా శ్రీనివాసరావు, చల్లా మరియదాసు, సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వర రావు(చిన్న), నగర సమితి సభ్యులు ఇరిగినేని వెంకటేశ్వర్లరావు, జగన్నాథం, ధూపాటి రత్నం, చెవుల పున్నయ్య, జంగాల చైతన్య, తిరుమలరావు, కోటి వీరాంజనేయులు, సాంసంగ్, దీవెన కుమార్, లేవీ, నవీన్, వెంకటేష్, నారాయణరావు, బుడే, కొండా వెంకటేశ్వర రెడ్డి, పౌలు, అబ్రహం, గణేష్, ఏగయా, పండారి ఏడుకొండలు పాల్గొన్నారు.

సర్వమత సమానత్వానికి ప్రతీక ఇఫ్తార్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ సర్వమత సమానత్వానికి ప్రతీక అని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక భాష్యం గోరంట్ల టెన్త్ క్యాంపస్ లో చైర్మన్ రామకృష్ణ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లిం సోదరులు అల్లాహ్ ఆశీస్సులు పొంది ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ అరబిక్ ప్రొఫెసర్ మహ్మద్ ఇషాక్ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ రామకృష్ణ చేతుల మీదుగా ఇఫ్తార్ విందును ప్రారంభించారు. ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ఉపవాస దీక్ష చేసే వారికి ఇఫ్తార్ విందు ఇవ్వడం వల్ల వారితో సమానంగా అల్లాహ్ నుండి పుణ్యం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యా సంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

మాణిక్యవేల్ మృతి తీరని లోటు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: సేవా రత్న, విద్యాదాత, అన్నదాత, స్ఫూర్తిదాత, ట్రిపుల్ ఎక్స్ సోప్స్ అధినేత అరుణాచలం మాణిక్యవేల్ మరణం తీరని లోటని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. శుక్రవారం స్థానిక అరండల్‌పేటలోని అయన నివాసంలో మాణిక్యవేల్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కష్టపడటం ఒక్కటే విజయానికి దారి అని తన జీవితం ద్వారా నిరూపించిన స్ఫూర్తిదాత మాణిక్యవేల్ అంటూ కొనియాడారు. తన సంపాదనలో అధికభాగాన్ని కార్మికులకు, సమాజానికి , దైవ చింతనకు కేటాయించిన మహామనిషి అని అన్నారు. నివాళులర్పించిన వారిలో రెల్లి రాష్ట్ర నేత సోమి ఉదయ్ కుమార్, మిద్దె నాగరాజు, చెన్నం శ్రీకాంత్ ఉన్నారు.

నేటి అర్జీల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: సీపీఐ

విశాలాంధ్ర-తాడేపల్లి : నిరుపేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఐదు లక్షల రూపాయలు నిర్మాణానికి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం తాడేపల్లి ప్రకాష్ నగర్, కృష్ణనగర్ ప్రాంతాలలోని పేదల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా నిరుపేదలకు గ్రామాలలో మూడు సెంట్లు పట్టణాలలో రెండు సెంట్లు ఇంటి నివేశ స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. లబ్ధిదారులందరకు ఇళ్ల స్థలాలను త్వరితగతిన ఇవ్వాలని కోరుతూ ఈ నెల 15వ తారీఖున మంగళగిరిలోని ఎంటిఎంసి కార్యాలయం కమిషనర్‌కి అర్జీలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కాశయ్య, వెంకటయ్య కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు షేక్ బాషా, ప్రసాద్, చిన్నారాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రజా దర్బార్

విశాలాంధ్ర- మాచర్ల : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న వెల్దుర్తి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో "ప్రజా దర్బార్" ను నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు.

అవకతవకలకు చిరునామాగా ఎన్నికల సంఘం మారటం సిగ్గుచేటు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తటస్థతకు తిలోదకాలొదిలి అవకతవకలకు అసలైన చిరునామాగా మారిన కేంద్ర ఎన్నికల సంఘంపై పార్లమెంట్ ఉభయ సభల్లో దద్దరిల్లినా తగు సమాధానం చెప్పకుండా దాటవేస్తున్న తీరు సిగ్గుపడాల్సిన విషయమని అవగాహన సంస్థ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు విమర్శించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'పారదర్శకత లేక ప్రజానీకం దృష్టిలో దోషిగా నిలబడుతున్న ఎన్నికల కమిషన్' అన్న అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా విశ్లేషకులు ముప్పాళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ రాజ్యాంగ సంస్థగా ఎంతో హుందాగా, నియమ నిబంధనలకు లోబడి పని చేయాల్సిన ఎన్నికల కమిషన్ అడుగడుగునా కంతలతో లోపాయికారి వ్యవహారాలతో ఎన్నికలు జరిపిస్తుందన్న ఆరోపణలు అనేక రాష్ట్రాల నుంచి వస్తున్నాయన్నారు. ఈ చర్చలో సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఆర్.రామచంద్రరావు న్యాయవాది అవధానుల హరి, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం వర్క్‌షాపు కరపత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర-పొన్నూరు : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ) ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీలలో గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో జరిగే రాష్ట్ర వర్క్‌షాప్ జయప్రదం చేయాలని కోరుతూ పొన్నూరు మండలం ములుకుదురు గ్రామంలో శుక్రవారం కరపత్రా లు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం తీరుతెన్నుల బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదని అన్నారు. గ్రామీణ వ్యవసాయ కార్మికులు నూటికి 70 శాతం వ్యవసాయంపై ఆధారపడి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నార న్నారు. ఈ నేపథ్యంలో పనులు లేక గ్రామాలకు గ్రామాలు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వలసలు వెళ్లడం జరుగుతుందని అన్నారు. సంవత్సరం పొడుగునా పనులు లేక చాలీచాలని వేతనాలతో వ్యవసాయ కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్నారన్నారు. దేశ ప్రజలకు ఆహార ధాన్యాలు ఆహార ఉత్పత్తిని పెంపొందించడంలో వ్యవసాయ కార్మికుల శ్రమ, కృషి కీలకమైనదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ కోటేశ్వ రరావు, ఆవుల శేఖర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు పాల్గొంటారని తెలిపారు. వ్యవసాయ కార్మికుల అభ్యున్నతికై పలు అంశాలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేయడానికి ఈ వర్క్ షాప్ దోహదపడుతుందని చెప్పారు. వ్యవసాయ కార్మికులు వేలాదిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ కార్యదర్శి షేక్ గౌస్, రఫీ, జానీ, కోటేశ్వరరావు, నాగుల్ మీరా, కరీముల్లా, వెంకటేశ్వరరావు, మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

గుంటూరు సిటీ, గోరంట్ల, నగరాలు, హనుమాన్ నగర్, వాసవి వెంకటేశ్వర ఎన్‌క్లేవ్, ఫ్లాట్ నెం. 408రు కాపురస్తులు OGGU VENKATA GANGADHARA RAO గారి భార్య OGGU VENKATA LAKSHMI JAYAKUMARI (సెల్: 8125809248) అను నేను తెలియజేయునది. నా పేరిట గల పాస్‌పోర్ట్ నెం.Y8220353 ఒరిజినల్ ను ది.05-03-2025న గోరంట్ల సెంటర్‌లో జిరాక్సు తీయించుకుని నాఇంటికి టూవీలర్‌పై వెళ్లు చుండగా పోగొట్టుకున్నాను. ఎవరికైనా సదరు పాస్‌పోర్ట్ దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

పాస్‌పోర్ట్ పోయినది

గుంటూరు సిటీ, గోరంట్ల, నగరాలు, హనుమాన్ నగర్, వాసవి వెంకటేశ్వర ఎన్‌క్లేవ్, ఫ్లాట్ నెం. 408రు కాపురస్తులు OGGU VENKATA SUBBAIAH గారి కుమారుడను OGGU VENKATA GANGADHARA RAO (సెల్: 8125809248) అను నేను తెలియజేయునది. నా పేరిట గల పాస్‌పోర్ట్ నెం.Y8220355 ఒరిజినల్ ను ది.05-03-2025న గోరంట్ల సెంటర్‌లో జిరాక్సు తీయించుకుని నాఇంటికి టూవీలర్‌పై వెళ్లు చుండగా పోగొట్టుకున్నాను. ఎవరికైనా సదరు పాస్‌పోర్ట్ దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

టిడ్కో గృహాలకు తాగు నీరందించేందుకు చర్యలు: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో ఇళ్ల సముదాయాల్లో నివాసం ఉంటున్న వారికి తాగునీరు అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక అడవితక్కెళ్లపాడులోని టిడ్కో గృహ సముదాయాలను జీఎంసీ, టిడ్కో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం కమిషనర్ పరిశీలించారు. మౌలిక వసతులపై ప్రజలు తెలిపిన సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అడవితక్కెళ్లపాడులోని టిడ్కో ఇళ్లల్లో సుమారు 1300 కుటుంబాలు నివాసం ఉంటున్నారని, సదరు ప్రాంతంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. తక్షణం తాగునీటి సమస్య తీరేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. అలాగే పారిశుధ్య సమస్యలపై కూడా ప్రజల నుంచి అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని, సదరు ప్రాంతంలో ప్రత్యేకంగా డ్రైవ్ చేపట్టి శుభ్రం చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పెన్షన్ల పంపిణీ, రేషన్ పంపిణీని ప్రజలకు చేరువగా అందించాలని, నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని స్పష్టంచేశారు. అవసరమైన ప్రాంతాల్లో కచ్చా డ్రైన్లు, జీఎస్బీ రోడ్ల ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహ సముదాయాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు టిడ్కో ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, టిడ్కో ఎస్ఈ ఉమామహేశ్వరశాస్త్రి, కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, డీఈఈలు శ్రీనివాస్, సేతుబాబు, ఎస్ఎస్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘ కార్యాలయము, వినుకొండ

ఆర్.సి.నెం.167/2025/ఏ2 తేది: 13.03.2025

బహిరంగ వేలము ప్రకటన

వినుకొండ పురపాలక సంఘమునకు సంబంధించి 2025-26 ఆర్థిక సం॥మునకు అనగా ది. 01-04-2025 నుండి 31-03-2025 వరకు కూరగాయల మార్కెట్ నందు ఆశీలు వసూలు చేసుకొను హక్కునకు, వాహనములు నిలుపు స్టాండు నందు ఆశీలు వసూలు చేసుకొను హక్కునకు, కబేళా మార్కెట్ నందు ఆశీలు వసూలు చేసుకొను హక్కునకు గాను మరియు సండ్రీ మార్కెట్ మునిసిపల్ సరిహద్దుల నందలి రోడ్డు మార్జిన్ల నందు ఆశీలు వసూలు చేసుకొను హక్కునకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో ది.22.03.2025న శనివారం మధ్యాహ్నం గం.03.00లకు బహిరంగ వేలము పాటలు నిర్వహించబడును. కావున ఆసక్తి కలవారు ధరావత్తు చెల్లించి వేలంపాటల నందు పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది.

మార్కెట్ పేరు	ధరావత్తు
1. కూరగాయల మార్కెట్	- 2,00,000/-
2. వాహనములు నిలుపు స్టాండు నందు ఆశీలు వసూలు చేసుకొను హక్కు	- 1,50,000/-
3. కబేళా మార్కెట్	- 50,000/-
4. సండ్రీ మార్కెట్	- 2,00,000/-

ఇతర వేలం షరతులను ఆఫీసు పని చేయు సమయములో తెలుసుకొనగలరు.

సం/- యం.సుభాష్ చంద్రబోస్, కమీషనరు,
వినుకొండ పురపాలకసంఘం.

అమరవీరుల సంస్మరణ సభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర -పెద్దకూరపాడు: ఈనెల 16న సీపీఐ శత వార్షికోత్సవం అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను జయప్రదం చేయాలని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్ చంద్ర జ్యోతి శ్రీ శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈనెల 16వ తేదీన పెదకూరపాడు సీపీఐ శాఖ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభసభ పరిష్కరించుకొని మాజీ శాసనసభ్యులు దర్శి లక్ష్మయ్య, అంబటి హనుమంతరావు, దర్శి పానకాలరావు, చిన్నప్ప మాస్టారు స్మారక స్థూపాల వద్ద జండా ఆవిష్కరణలతో పాటు రైల్వే స్టేషన్ రోడ్డు వాటర్ ట్యాంకి వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సీపీఐ సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శులు కాసా రాంబాబు షేక్ హుస్సేన్ జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి ఖైర పట్నం రామకృష్ణ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. అనంతరం ప్రజానాట్యమండలి దళంతో సంస్కృతి కార్యక్రమాలు నియోజవర్గం సీపీఐ నాయకులు కార్యకర్తలు సానుభూతిపరులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు ముసులూరి రమేష్, నియోజవర్గ సీపీఐ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటి పూట బడులు

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లాలో శనివారం నుంచి ఒంటిపూట బడులను అమలు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్ర కళ శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 23 వరకు ప్రభుత్వ ప్రైవేటు బడుల్లో ఉదయం 7:45 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు తరగతులు జరుగుతాయన్నారు.10వ తరగతి పరీక్షలు జరిగే పాఠశాలల్లో పరీక్షలు ముగిసే వరకు మధ్యాహ్నం 1:15 నుంచి 5 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. కచ్చితంగా ప్రైవేటు పాఠశాలల్లో ఒంటిపూట బడులు అమలు చేయాలన్నారు.

ఈద్గా అభివృద్ధికి రూ.40 లక్షలు కేటాయించండి: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : వినుకొండలో ఈద్గా మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని, ఈద్గా అభివృద్ధికి పురపాలక సంఘం నుంచి రూ.40 లక్షలు కేటాయించాలని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు ఆదేశించారు. పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులో గల కబ్రస్థాన్ శుభ్రం చేసేందుకు 5 లక్షలతో పరిపాలక సంఘం చేపట్టిన పనులను శుక్ర వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించే ఈద్గా అభివృద్ధి చేయాలని తమకు విన్నవించారన్నారు. ఈద్గా ప్రాంగణ చదును చేయటం, చుట్టూ ప్రహరీ, గేట్లు ఏర్పాటు తదితర అభివృద్ధి పనులకు సంబంధించి 40 లక్షల నిధులు కేటాయించేందుకు కౌన్సిల్ తీర్మానం చేయాలని ఆయన మున్సిపల్ చైర్మన్, అధికారులను ఆదేశించారు. ఈద్గా నిర్మాణం పనులకు సంబంధించి ముస్లిం సోదరులతో కలిసి నగం నిధులు శివశక్తి ఫౌండేషన్ అందిస్తుందని వెల్లడించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా కబ్రస్థాన్‌లో సిమెంటు రోడ్లు, వీధి లైట్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో కబ్రస్థాన్ను పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేసిందని అన్నారు. ఇమాములు, మౌజన్లకు గత వైసిపి ప్రభుత్వం జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు నాయుడు వారికి జీతాల బకాయిలను చెల్లించి ఆదుకుందన్నారు. ఉర్దూ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ముస్లిం మైనారిటీ నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించిందన్నారు. ముస్లిం మైనారిటీల అభివృద్ధికి పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ముస్లిం సోదరులు అండగా నిలవాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, కమిషనర్ సుభాష్ చంద్రబోస్, టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు అయూబ్ ఖాన్, చెరుకుంపాలెం షమీం, పివి సురేష్ బాబు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

అర్జీల అందజేత కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలి



విశాలాంధ్ర-చిలకలూరిపేట: అర్హులైన పేదలకు నివేశన స్థలాలు అందజేయాలన్న డిమాండ్‌తో శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అర్జీల అందజేత కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబూరావు అన్నారు. సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు చొప్పున అందజేస్తామని సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఏ ఒక్కరికి కూడా సెంటు భూమి ఇవ్వలేదన్నారు. కూలీ నాలీ చేసుకొనే ప్రజలు తమ సంపాదనలో ఎక్కువ భాగం ఇంటి అద్దెలు చెల్లించటానికే సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ పేదల తరుపున పోరాటం చేస్తోందని, నివేశన స్థలాలు ఇచ్చే వరకు పేదల పక్షాన నిలబడుతుందని వెల్లడించారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ వద్ద నివేశన స్థలాల అర్జీల అందజేత కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని పిలుపు నిచ్చారు.

వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలి: ఈశ్వరరావు

విశాలాంధ్ర-తెనాలి : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం (బి.కె.యం) రాష్ట్ర వర్క్‌షాప్ ఈ నెల 16, 17 తేదీలలో ఉదయం 10 గంటలకు గుంటూరు కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో జరుగుతుందని, ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మికసంఘం ప్రధానకార్యదర్శి కాబోతు ఈశ్వరరావు పిలుపునిచ్చారు. తెనాలి గాంధీనగర్, సిపిఐ కార్యాలయంలో తెనాలి నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించారు. సభాప్రారంభంలో కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. ఈశ్వరరావు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కార్మికులు నూటికి 70 శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. కొన్ని ప్రాంతాలలో ఉపాధి దొరక్క వ్యవసాయ కూలీలు గ్రామాలు ఖాళీ చేసి జిల్లా, రాష్ట్రాలకు వలసలు పోతున్నారని చెప్పారు. సంవత్సరం పొడుగునా పనులు లేక చాలీ చాలని కూలితో కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. తక్షణం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి గ్రామాలలో ఉపాధి పనులు ప్రారంభించి వలసలను ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ వర్క్‌షాప్‌కు ముఖ్య అతిధిగా రాష్ట్ర సిపిఐ కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎంయల్‌సి జల్లి విల్సన్, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘ గౌరవ అధ్యక్షుడు సిహెచ్ కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల శేఖర్, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరావు తదితర నాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో బొల్లిముంత కృష్ణ, పరచూరి వెంకటేశ్వర్లురావు, యాతం కోటేశ్వరి, శివ, తేజ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు వినియోగం కంటే గొప్పది: ప్రసాద్

విశాలాంధ్ర-తాడేపల్లి : ఒక యూనిట్ విద్యుత్ పొదుపు, ఒక యూనిట్ విద్యుత్ ఉత్పత్తి కంటే గొప్పదని, రోజు వారీ జీవితంలో అత్యవసరమైన విద్యుత్‌ని సమర్ధవంతంగా వినియోగించుకోవటం వలన బిల్లు తగ్గటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని కెఎల్ యూనివర్సిటీ విద్యార్ధి విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్. ప్రసాద్ ప్రజలకు సూచించారు. శుక్రవారం తాడేపల్లి మండలంలోని చిర్రావూరు గ్రామంలో కెఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం సీఎస్ఈ హానర్స్ ఆధ్వర్యంలో విద్యుత్ పొదుపు, నిర్వహణ అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్, వాలంటీర్లను యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ సెంథిల్ అథితన్ తదితరులు అభినందించారు.

వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-మాచర్ల : ఈ నెల 16న మాచర్లలో జరుగనున్న స్వాతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని టీడీపీ మాజీ కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని చిన్న కాన్వెంట్ సెంటర్లో ఏర్పాటు చేయనున్న మహనీయుని విగ్రహావిష్కరణకు టిడిపి అగ్ర నాయకులు రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొనాలని ఆయన కోరారు.

16న దేవస్థానం పునః ప్రతిష్ఠ

విశాలాంధ్ర - దాచేపల్లి : గామాలపాడులో నాయకురాలు నాగమ్మ నిర్మించిన పురాతన శివాలయాన్ని పునరుద్దరణ చేయాలని టీటీడీ పాలక మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి, శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి, ఆజాద్ హిందూ బోర్డు కార్యనిర్వాహక అధ్యక్షుడు దేవరశెట్టి రామకృష్ణ సంకల్పించారు. దీనిలో భాగంగానే ఈ నెల 16న శ్రీపార్వతీదేవి సమేత చెన్నమల్లికార్జున స్వామి, గణపతి, ద్వార పాలకులు, నందీశ్వరుడు, బలిపీఠం, శిఖర ప్రతిష్ఠ జరుగుతాయని జంగా తెలిపారు. ఈ నేపధ్యంలోనే తొలి రోజు శుక్రవారం గణపతి పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు.

సీపీఐ ఆధ్వర్యంలో కారల్‌మార్క్స్‌కు ఘన నివాళి

విశాలాంధ్ర-పొన్నూరు : ప్రపంచ కార్మికులారా ఏకంకండి అని నినదించిన కార్లమార్క్స్ ఉద్యమాలను రహస్యంగా బహిరంగంగా రహస్య చట్టబద్ధ, చట్ట వ్యతిరేక పార్లమెంటరీ పార్లమెంటేతర నిరాయుధ ఆయుధ అహింస హింసాయిత మార్గాలు విప్లవోద్యమంలో భాగమని కార్లమార్క్స్ రూపొందించారని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి గుంటూరు జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. రష్యా చైనా వియత్నాం కొరియా క్యూబా దేశాలు మార్క్సిజం మార్గంలో కార్లమార్క్స్ ప్రశ్యాదేశంలో రెయిన్ రాష్ట్రంలోని ట్రియార్ పట్టణములో 18 మే నెల ఐదవ తేదీన జన్మించారని, చిన్నతనం నుండి శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఆయన ఆలోచనలు ఉండేవని పెట్టుబడిదారీ వర్గం ప్రజలను ఏ విధంగా దోచుకుంటుందో అర్థం చేసుకొని శ్రామికులు దోపిడీ నుండి విముక్తి కావాలని కోరుకునే ఆలోచనలతో ఆయన మనసు నిండి ఉండేదని అన్నారు. ఆయన జీవన పయనంలో ఫెడరీ ఏంగిల్స్ తోడవడం శ్రమ విలువ మీద అనేక జనాలు చేసి పెట్టుబడి అనే గ్రంథాన్ని రాశారని అన్నారు. ఆ పెట్టుబడి గ్రంథం ద్వారా శ్రమ దోపిడీ ఏ విధంగా జరుగుతుందో తెలుసుకొని కార్మికులందరినీ రైతులందరినీ ఒక తాటిపై నడిపి రష్యా దేశంలో లెనిన్ విప్లవం ద్వారా జార్ చక్రవర్తులను పారద్రోలి కమ్యూనిస్టు దేశంగా ఏర్పాటు చేశాడన్నారు. తరువాత అనేక దేశాలలో మార్క్సిజం వ్యాప్తి చెంది అనేక దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు స్థాపన జరిగిందని అన్నారు. మార్క్స్ తన జీవితంలో ఎంతో దరిద్రాన్ని అనుభవించారని తన భార్య పిల్లలకు అందం కూడా పెట్టలేని పరిస్థితులు ఏర్పడి చనిపోయారని, ఆయన చూపిన మార్గంలోనే ఈరోజు అనేక దేశాలలో పోరాటాలు జరుగుతున్నాయని, శ్రమ దోపిడి ఉన్నంతకాలం మార్క్సిజం ఉంటుందని అన్నారు. కార్లమార్క్స్ 1883 మార్చి 14వ తేదీన మరణించడం జరిగిందని, కార్లమార్క్స్ వర్ధంతి శుభ సందర్భంగా కొల్లూరులో స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో కార్ల్ మార్క్స్ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రాజబాబు, భరత్, తిరుపతయ్య, రాజు, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

కీ॥శే॥ వేము సువార్తమ్మ గారు

జననం : 01-07-1934 మరణం : 01-03-2025

కామ్రేడ్ వేము సువార్తమ్మ (భర్త, రామ సుబ్బయ్య) తాను నమ్మిన ఆశయం కోసం జీవితాంతం భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ.) కార్యకర్తగా, మహిళా సమాఖ్య నాయకురాలిగా, ప్రజానాట్య మండలి, బాలసంఘాల్లో ప్రముఖ పాత్ర వహించారు. ఆమె జీవితాంతం సి.పి.ఐ. బాటలో పయనించారు. మార్చి ఒకటోతేదీ మృతి చెందారు. ఆమెకు జోహార్లు.

జోహార్ సువార్తమ్మ - జోహార్ సువార్తమ్మ

కుమారుడు : వేము సమత - వేము రంజన్‌రాయ్

కుమార్తెలు : జ్యోత్స్న - లెనిన

గాయకుడు గరిమెళ్ళ మృతికి కళా సంస్థల సంతాపం

విశాలాంధ్ర- విజయవాడ కల్చరల్ : శ్రీవారి తత్వాన్ని, భక్తి తత్వాన్ని, భగవతత్వాన్ని అన్నమయ్య సంకీర్తనల ద్వారా చాటిన తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకుడు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ మృతి కళా రంగానికి తీరని లోటని పలు కళా సంస్థల ప్రతినిధులు తెలిపారు. గోళ్ళ నారాయణరావు, చింతకాయల చిట్టిబాబు, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, కె.వి బ్రహ్మానందం, డేవిడ్ రాజు, కారుమంచి రాజు తదితరులు ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు.

సుస్వరాల హారం చిత్రగీతాల గానం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : భానుశ్రీ మ్యూజికల్ ఈవెంట్స్, ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా సమర్పణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సినీ గీతాల సమాహారం పేరిట జరిగిన చిత్ర గీతాలాపన శ్రోతలను పరవశింపచేసింది. సంస్థల అధినేతలు, గాయనీ గాయకుడు భానుశ్రీ, సయ్యద్ అలీ, ఇందు నయన, శిరీష పట్నాయక్, వికాస్, కృష్ణదాస్, ఒరుగంటి ఫణి, గూడూరి సత్యనారాయణ అపురూపమైనదమ్మ ఆడజన్మ, చరణ కింకిణులు గల్లు గల్లు మన, శంకరా నాద శరీరాపరా వంటి ఇత్యాది ఆణి ముత్యాల వంటి పాటలను పాడుతూ సంగీత సాహిత్యాల మాధుర్యాన్ని పంచారు.

స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర పై దృష్టి సారించండి : ఎంపీడీవో

విశాలాంధ్ర పెదపారుపూడి : స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర పై దృష్టి సారించాలని ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మి, మండల ఈ ఓ పి ఆర్ డి వంగ శ్రీనివాస్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ విషయమై ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 19 పంచాయతీల పరిధిలో ప్రతినెల మూడో శనివారం సింగిల్ యూస్ ప్లాస్టిక్ రద్దు పై తీర్మానం కోసం గ్రామ సభలు నిర్వహించాలని, అలాగే గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా, పారిశుద్ధ్య పనులు నిర్విరామంగా చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

విద్యా, వైద్యానికి ప్రభుత్వం నిరంతర కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పెడన : పేద ప్రజలకు విద్యవైద్యం అందించడం కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఒకటవ వార్డులో ఉన్న అర్బన్ హెల్త్‌సెంటర్‌కు రూ.90వేలు విలువైన ఆక్సిజన్ కాన్స్‌స్టేటర్‌ను ఆసుపత్రి వైద్యురాలు హిమజా పద్మకి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, నియోజకవర్గంలోని కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వార్ల బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ రూరల్ మండలం నున్నలో మూడు రోజులపాటు నిర్వహించిన శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వార్ల దేవస్థానం బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. చివరి రోజైన శుక్ర వారం గ్రామ పురవీధులలో విజయయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి కళ్యాణోత్సవం పూర్తయిన తర్వాత మరుసటి రోజు నిర్వహించే రథోత్సవాన్ని విజయ యాత్రగా చెబుతారు. తొలుత దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి ఎన్ హేమలత దేవి రథోత్సవాన్ని ప్రారంభించారు. శ్రీ అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచి భక్తుల నృత్యాలు, కోలాటం మధ్య గ్రామంలో ఊరేగించారు. రథంపై దేవస్థానం ప్రధానార్చకులు, శివాచార్య డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్ ఆశీనులై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ విజయ యాత్రకు భక్తులు తమ ఇళ్ల ముంగిట భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో రథాంగ హోమం, యాగశాలలో విశేష హోమాలు, పూర్ణాహుతి జరిగాయి. కాగా, స్వామి వారికి స్థానిక కొలనులో త్రిశూల స్నానం ఆచరించారు. సాయంత్రం స్వామి వారి ధ్వజావరోహణ, ద్వాదశ ప్రదక్షిణలు, ఏకాంత సేవ జరిగాయి. ఈ కార్యక్రమంలో శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి పీఠాధిపతి మునీంద్రా మహరాజ్, వేద పండితులు ఉదయ భాస్కర శర్మ, అయ్యప్ప, మామిళ్లపల్లి వెంకటేష్, కే వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటై... చైన్ స్నాచింగ్‌లు

- ఎనిమిది కేసుల్లో ఏడుగురు నిందితుల అరెస్ట్
- రూ.16.12 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, 5 బైక్‌లు స్వాధీనం
- గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : వ్యసనాలు, సరదాలు, జల్సాల కోసం చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న పలువురు నిందితులను వివిధ కేసుల్లో అరెస్టు చేసినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైన్ స్నాచింగ్ కేసులలో నిందితుల అరెస్టు వివరాలు వెల్లడించారు. మొత్తం ఎనిమిది కేసుల్లో ఏడుగురు నిందితులు పోతర్లంక సాయి మాధవ్, షేక్ మాగ్బుల్, అమర్తలూరి నాని, మహమ్మద్ సమీర్, ధనావత్ హనుమంత్ నాయక్, సయ్యద్ కరిముల్లా, షేక్ బారావలిలను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి రూ.16.12 లక్షల విలువైన సుమారు 162 గ్రాముల బంగారు ఆభరణాలు, ఐదు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దొంగతనం చేసిన ద్విచక్ర వాహనాలతో గత రెండు సంవత్సరాల నుంచి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్నారన్నారు. తెనాలి పట్టణానికి చెందిన ఒక మహిళ తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెంచుపేట బ్రిడ్జి క్రిందిగా ఆటో దిగి నడుచుకుంటూ వెళుచుండగా ఎవరో గుర్తుతెలియని వ్యక్తి వెనుక నుంచి నడుచుకుంటూ వచ్చి ఆమె మెడలోని బంగారు చైనును బలవంతంగా తెంపుకొని కొంత దూరంపోయిన తర్వాత వచ్చిన ఒక బైకుపై పారిపోయాడని జనవరి 27న ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెనాలి మూడవ పట్టణ సీఐ రమేష్ బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు. తెనాలి రూరల్ ఎస్సై ప్రతాప్, కానిస్టేబుల్ వాకా రవి ఇచ్చిన సమాచారం మేరకు చినరావూరు తోటకు చెందిన పోతర్లంక సాయి మాధవ్ అనే వ్యక్తి ఈ నేరానికి పాల్పడ్డాడని, అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా, సరదాల కోసం, జల్సాల కోసం చినరావూరు తోటకి చెందిన మరి కొంతమంది కుర్రోళ్ళతో ద్విచక్ర వాహనాలను దొంగిలించి, వాటితో గత రెండు సంవత్సరాల నుంచి ఈ చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడుతున్నారని విచారణలో వెల్లడించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 4 చైన్ స్నాచింగ్ దొంగతనాలతో పాటు తన బంధువుల ఇంట్లో కూడా ఒక దొంగతనానికి పాల్పడ్డాడని, దొంగిలించిన బంగారు చైనులను వీరిలో ఒక నిందితుడైన షేక్ మక్బూల్ అనే అతనికి ఇచ్చి తెలిసినవారికి విక్రయిస్తూ వచ్చిన నగదుతో జల్సాలు చేస్తూ ఉంటాడని తెలిసిందన్నారు. వీరిలో ధనావత్ హనుమంతు నాయక్ అనే వ్యక్తి తెనాలి 1వ పట్టణంలో బైక్ దొంగతనానికి పాల్పడగా, అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించడం జరిగిందన్నారు. ఇతనిపై సస్పెక్ట్ షీట్ కూడా తెరవడం జరిగిందని చెప్పారు. అదేవిధంగా వారికి దిశానిర్దేశం చేస్తూ ఎప్పటికప్పుడు కేసుల పురోగతిని పర్యవేక్షించిన తెనాలి డీఎస్పీ జనార్ధన్ రావును ప్రత్యేకంగా అభినందించారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని దుర్గారంలో ఘనంగా నిర్వహించారు. 27వ డివిజన్ అధ్యక్షులు దాసరి నగరాజు ఆధ్వర్యంలో జనసేన పార్టీ 12వ అవిర్భావ దినోత్సవాన్ని సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్యఅతిధిగా బొలిశెట్టి వంశీ, టీడీపీ నాయకులు నవనీతం సాంబశివరావు, కొండపల్లి రూప్ కుమార్, బందారు కొండ, దాసరి జయరాజు, రవణమ్మ, జనసేన డివిజన్ నాయకులు రాజనాల శ్రీనివాస్, పసుపులేటి పిచ్చేశ్వరరావు, మారాసు రమణ, ఉన్నూరు క్రాంతి, బందారు వంశీ, రామిశెట్టి సుధాకర్, గోపి తదితర మహిళలు పాల్గొన్నారు.

పార్టీకి సేవే కార్యకర్తకి గుర్తింపు : మాజీ ఎమ్మెల్యే కైలే

విశాలాంధ్ర -పమిడిముక్కల: పార్టీకి కార్యకర్త గా చేసిన సేవలే పార్టీ బలోపేతానికి కృషి చేస్తాయని దాని ప్రతిఫలం గుర్తింపు తేస్తుందని మాజీ ఎమ్మెల్యే కైలే వైసిపి పార్టీ అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు పామర్రు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో అధ్యక్షులను ప్రకటించారు. పామర్రు టౌన్ :కి నందిపాటి సురేష్ రెడ్డి పామర్రు రూరల్: కాకర్ల వెంకటేశ్వరరావు పమిడిముక్కల : యలమంచిలి గణేష్ బాబు తోట్లవల్లూరు:కళ్ళం వెంకటేశ్వర రెడ్డి మొవ్వ: రాజులపాటి రాఘవరావు పెదపారుపూడి: గోగం సురేష్ ని నియమించగా వైఎస్సార్ పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గా తిరుమల శెట్టి బోసు బాబు(వేల్పూరు) వాలంటీర్ల విభాగం అను బంధ సంఘాల జిల్లా అధ్యక్షుడుగా పి.వంశీకృష్ణని నియమించారని తెలిపారు.

రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే కాగిత

విశాలాంధ్ర-పెడన : రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని తోటమూల సెంటర్‌లోటీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో 42 మంది లబ్ధిదారులకు రూ.35,62,146 సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమీ ప్రభుత్వం ఎల్లప్పుడు పేదవాడికి అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ హామీ ఆగదని ఈ లోపే వైసిపి కావాలని లేనిపోని రాద్ధాంతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, పెడన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శలపాటి. వీరప్రసాద్, ప్రధాన కార్యదర్శి సీరం. ప్రసాద్ పట్టణ నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గౌరవ పూర్ణిమ మహోత్సవం

- మందిర అధ్యక్షులు చక్రధారి దాస్

విశాలాంధ్ర-విజయ వాడ (చిట్టినగర్): గౌర పూర్ణిమ మహా మహోత్సవం ఉండవల్లి ఇస్కాన్ శ్రీ రాధా శ్యాం సుందర్ మంది రంలో అత్యంత వైభవ ంగా శుక్రవారం నిర్వహించారు. మహా శంఖాభిషేకం, మందిర అధ్యక్షులు చక్రధారిదాస్ ప్రవచనమిస్తూ శ్రీ చైతన్య మహా ప్రభువు ప్రారంభించిన కృష్ణ భక్తి ఉద్యమము ద్వారా జీవులలో అంతర్లీనంగా ఉన్న భగవత్ ప్రేమను జాగృత పరచి కృష్ణ భక్తి భావన పట్ల ఆకర్షితులను గావించెన్నారు. ఇస్కాన్ రాధా శ్యామ్ సుందర్ మందిర్లో తెల్లవారుజామున నుండి మంగళ హారతితో కార్యక్రమం ప్రారంభమైంది. ఉదయం నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈనాటి కార్యక్రమములో శంఖాభిషేకము, మధురమైన కీర్తనలు,భజనలు, ప్రవచనములు, యూత్ వింగ్‌చేసిన కీర్తనలు, శ్రీ చైతన్య మహా ప్రభు జార్ఖండ్ అరణ్యములో జంతువులచే హరి నామము జపింపచేసిన లీలను దృశ్య రూపకముగా చేసిన అమరికలు ప్రత్యేక ఆకర్షణగా నిలచినవి.ఆస్ట్రేలియా నుండి విచ్చేసిన శ్రీమాన్ సేవ్య భగవాన్ దాస్ చే చైతన్య భగవానుని లీలల పై ఇచ్చిన దివ్య ప్రవచనము ఎంతగానో ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమానికి వివిధ సేవాకార్యక్రమాల్లో పాల్గొని కార్యక్రమాన్ని చిరస్మరణీయం చేసినందుకు అందరికీ శ్రీమాన్ చక్రధరి దాస్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అందరికీ అన్న ప్రసాద వితరణ చేశారు.

విద్యుత్ వినియోగదారులు సహకరించాలి

విశాలాంధ్ర- అవనిగడ్డ : విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించాలని ఉయ్యూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి కృష్ణ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు 15వ తేదీ శనివారం అవనిగడ్డ మండలంలోని కొత్త ఎడ్ల లంకలో నూతన సబ్ స్టేషన్ నెలవారి మెయింటెనెన్స్ కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని అవనిగడ్డ గ్రామంలో 2.3.4.5.6.7.8.9 వార్డులతోపాటు కొత్తపేట రామకోటి పురం. బందలై చెరువు. గుడివాడ వారి పాలెం. పాత ఎడ్ల లంక. వేకనూరు. తుంగలవారి పాలెం గ్రామాలలోని విద్యుత్తు వినియోగదారులకు ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్కు అంతరాయం కలుగుతుందని కావున వినియోగదారులు అందరూ సహకరించాలని కోరారు.

నేటి నుండి ఒంటిపూట పాఠశాలలు

విశాలాంధ్ర- అవనిగడ్డ : ఈనెల 15వ తేదీ శనివారం నుండి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినది ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు తరగతులు కొనసాగుతాయి 10వ తరగతి పరీక్షలు జరిగే పాఠశాలలో మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట పాఠశాలలు జరుగుతాయి ఆ తరువాత పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించనున్నారు.